SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131



సంపుటి : 18 సంచిక : 291 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 29, జూన్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5






## మీ రోదసి యాత్ర..
# నవశకానికి నాంది

- ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లాతో ముచ్చటించిన మోదీ
- అంతరిక్షం నుంచి భారత్ భవ్యంగా కనిపిస్తోందన్న వ్యోమగామి

దిల్లీ: భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్).. 'భారత్ మాతా కీ జై' నినాదాలతో మార్మోగింది. 41 ఏళ్ల విరామం తర్వాత రోదసిలోకి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతో వీడియో లింక్ ద్వారా ప్రధాని మోదీ సంభాషించినప్పుడు ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. శుక్లా మిషన్‌తో భారతస్వీయ మానవసహిత యాత్ర గగన్‌యాన్ దిశగా తొలి అడుగుపడిందని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. శుక్లా మాట్లాడుతూ... ''అంతరిక్ష కేంద్రం భూమిని రోజుకు 16 సార్లు చుడు తోంది. నిత్యం 16 సూర్యోదయాలు, సూర్యాస్తమయాలను వీక్షించే అవకాశం నాకు కలిగింది. ఇప్పుడు గంటకు 28 వేల కిలోమీటర్ల వేగంతో పయనిస్తున్నాం. మన దేశం పురోగమిస్తున్న వేగానికి ఇది అద్దం పడుతోంది. అంతరిక్షం నుంచి భారత్‌ను మొదటిసారి చూసినప్పుడు


తరువాయి 2లో


## ఇరాన్‌పై..
# మళ్లీ బాంబులేస్తా

- నీచమైన చావు చావకుండా ఖమేనీని రక్షించా
- అయినా ఆయన ధన్యవాదాలు చెప్పలేదు
- డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం

**జూన్ 28, సమయం న్యూస్,** వాషింగ్టన్: ఇజ్రాయెల్‌తో జరిగిన 12 రోజుల యుద్ధంలో తమదే విజయం అంటూ ఇటీవల ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. విద్వేషంతో చేసిన ఖమేనీ ప్రకటన చూసిన తర్వాత ఆ దేశంపై విధించిన ఆర్థిక ఆంక్షలు సడలించాలన్న ఆలోచనను విరమించుకున్నానని చెప్పారు. ఇరాన్ తన అణుకార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తే మళ్లీ ఆ దేశంపై బాంబులు వేయడానికి తాను


తరువాయి 2లో






## కంచ గచ్చిబౌలిలో
# ఐటీ టవర్లు నిర్మిస్తాం..

- అభివృద్ధిని విపక్షాలు అడ్డుకుంటున్నాయి
- కాంగ్రెస్ వల్లే హైదరాబాద్‌కు ప్రపంచ ఖ్యాతి
- పీజేఆర్ ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

**జూన్ 28, సమయం న్యూస్, హైదరాబాద్:** ప్రతిపక్షాలు అవాస్తవాలను ప్రచారం చేస్తూ హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయంటూ సీఎం రేవంత్‌రెడ్డి భారాస, భాజపాలపై విమర్శలు గుప్పించారు. గతంలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే, తమ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి కాపాడిందన్నారు. విదేశాల్లో తిరిగి, పెట్టుబడుల కోసం కంపెనీలను ఒప్పించి, కంచ గచ్చిబౌలిలో ఐటీ టవర్ల నిర్మాణం మొదలుపెడితే.. ఆ పనులనూ ప్రతిపక్షాలు అడ్డుకున్నాయన్నారు. వీటన్నింటినీ ఎదుర్కొని ఐటీ టవర్ల నిర్మాణంతో 2 లక్షల మందికి


తరువాయి 2లో


## దేశ చరిత్రను
# వక్రీకరించారు..

- భాగ్యనగరిలో ప్రారంభమైన ఉత్సవాలు

**జూన్ 28, సమయం న్యూస్, హైదరాబాద్:** దేశ చరిత్ర వక్రీకరణకు గురైందని, మన గొప్పతనాన్ని పాశ్చాత్యులు జీర్ణించుకోలేకపోయారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. నిజమైన చరిత్రను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ రచించిన 'బహుముఖ బనారస్' పుస్తకాన్ని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓ హోటల్‌లో ఆయన శనివారం ఆవిష్కరించారు. 'మిసిమి' మాసపత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'మధ్యయుగంలో జరిగిన దండయాత్రల్లో మన సంపదను దోచుకెళ్లారు. సంస్కృతీ సంప్రదాయాల్ని నాశనం చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు నలంద, తక్షశిలను ధ్వంసం చేశారు. బ్రిటిష్


తరువాయి 2లో




# కమల దళపతి ఎవరో..?

- ప్ర ధాన రేసులో ఈటల, కె.లక్ష్మణ్
- పోటీలో రామచందర్‌రావు, అర్వింద్ సైతం
- నేడు నోటిఫికేషన్.. 30న నామినేషన్.. 1న ప్రకటన

హైదరాబాద్: తెలంగాణ భాజపా అధ్యక్ష పగ్గాలు ఎవరికి దక్కుతాయన్న ఉత్కంఠకు ఆదివారం సాయంత్రం లేదా సోమవారం తెరపడనుంది. నాయకత్వ పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయంపై భాజపా అగ్రనేతల


తరువాయి 2లో










## 'సింగరేణి' ప్రమాద బీమా పథకం దేశానికి ఆదర్శం


2లో




## అందరికంటే అత్యుత్తమంగా
# ఉచిత బస్సు ప్రయాణం..

- ఆర్థికంగా భారమైనా.. మహిళల కోసం ఆగస్టు 15 నుంచి అమలు
- ఇకపై ఆర్టీసీలో అన్నీ విద్యుత్ బస్సులే తీసుకోవాలి
- సమీక్షలో సీఎం చంద్రబాబు

**జూన్ 28, సమయం న్యూస్, అమరావతి :** 'ప్రస్తుతం దిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాయి. అన్నీ వేర్వేరు విధానాలను పాటిస్తున్నాయి. మన విధానం అత్యుత్తమంగా, సంతృప్తి కలిగేలా ఉండాలి' అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలకిచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, అందుకే ఆగస్టు 15 నుంచి ఈ పథకం అమలుచేస్తామని సీఎం తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై.. సీఎం చంద్రబాబు శనివారం క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ పథకం వల్ల పెరిగే ప్రయాణికుల సంఖ్యకు తగినట్లు బస్సుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. కొత్త బస్సులు కొనాలని, అవసరమైతే అద్దెకు తీసుకోవాలని సూచించారు. ఇకపై తీసుకునే


తరువాయి 2లో

## ఇరాన్‌పై..మళ్లీ బాంబులేస్తా

(మొదటిపేజీ తరువాయి)

వెనుకాడబోనని హెచ్చరించారు. ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఖమేనీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టు పెట్టారు. ''యుద్ధంతో నాశమైన దేశానికి సుప్రీం నేతైన ఖమేనీ, ఇజ్రాయెల్‌పై నెగ్గానని మూర్ఖంగా చెబుతున్నారు. అది అబద్ధమని ఆయనకూ తెలుసు. ఆ దేశం నాశనమైపోయింది. మూడు రాక్షస అణుకేంద్రాలు తుడిచిపెట్టుకుపోయాయి. యుద్ధ సమయంలో ఖమేనీ ఎక్కడ దాక్కున్నాడో నాకు తెలుసు. ఇజ్రాయెల్, అమెరికా సైనిక దళాలు ఆయన్ను హతమార్చకుండా అడ్డుకున్నా. నీచమైన చావు చావకుండా రక్షించా. అయినా ఖమేనీ నాకు ధన్యవాదాలు చెప్పలేదు. ఇరాన్‌ను ఆఖరిదెబ్బ తీయడానికి టెహ్రాన్ వైపు భారీస్థాయిలో వెళుతున్న యుద్ధవిమానాలను వెనక్కి మళ్లించాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేశా. ఆ దాడి జరిగితే వేల మంది ఇరానియన్లు చనిపోయేవారు. గత కొన్ని రోజుల నుంచి ఆ దేశంపై ఆంక్షలు సడలించాలని ఆలోచిస్తున్నా. కానీ ఖమేనీ కోపంతో, విద్వేషంతో చేసిన ప్రకటన చూసిన తర్వాత ఆ ఆలోచనలు విరమించుకున్నా'' అని ట్రంప్ పేర్కొన్నారు.

*** అమెరికా అధ్యక్ష పదవి ప్రమాదకరం: ట్రంప్**

అమెరికా అధ్యక్ష పదవి ప్రమాదకరమైనదని అధ్యక్షుడు ట్రంప్ అభిప్రాయపడ్డారు. తనకు అప్పుడప్పుడు అధ్యక్ష పదవిపట్ల బాధాకరమైన అనుభూతి కలుగుతుందని చెప్పారు. శ్వేతసౌధంలో ఆయన మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఉదాహరణకు మీరు కార్ రేసింగ్ డ్రైవర్లు అనుకుందాం. అక్కడ 100 మందిలో ఒకరు మరణించే అవకాశం ఉంది. అంటే ఒక శాతం మంది చనిపోయే ఛాన్స్ ఉంది. బుల్ రైడర్లూ అంతే. కారు రేసింగ్, బుల్ రైడింగ్‌లాగే అమెరికా అధ్యక్షుడికి చావు ఎప్పుడు ఎదురవుతుందో చెప్పలేం. అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 5 శాతం మరణించే అవకాశాలున్నాయి. ఈ విషయం నాకు ఎవరైనా ముందే చెప్పి ఉంటే అధ్యక్ష రేసులో ఉండేవాడిని కాదు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## దేశ చరిత్రను వక్రీకరించారు

(మొదటిపేజీ తరువాయి)

పాలనకు ముందు భారత్ అన్నింట్లో అగ్రస్థానంలో ఉండేది. యువత తలచుకుంటే మళ్లీ ఆ స్థాయికి చేరుకోవడానికి ఎక్కువ సమయం పట్టదు. నూతన విద్యావిధానంతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో రాజకీయానికి ఆస్కారం లేదు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో చదువుతున్న సమయంలో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించగా... సుమారు 17 నెలల పాటు జైలులో ఉన్నాను. ఎమర్జెన్సీలో ఎదురైన పరిస్థితులపై పాఠ్యాంశం తీసుకురావాల్సిన అవసరం ఉంది' అన్నారు. కార్యక్రమంలో మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, ఓయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ వై.పార్థసారథి, కేంద్ర సాహిత్య అకాడమీ (తెలుగు) కన్వీనర్ ప్రొఫెసర్ సి.మృణాళిని, దూరదర్శన్ ప్రయోక్త ఓలేటి పార్వతీశం, ఆకాశవాణి విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ సీవీఎస్ రాంబాబు, మిసిమి పత్రిక సంపాదకుడు వి.అశ్వినికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఇంటర్‌లో తప్పి.. ఐపీఎస్‌గా ఎదిగి**

దిగువ మధ్యతరగతి కుటుంబం.. వ్యవసాయమే జీవనాధారం.. పదో తరగతిలో ద్వితీయ శ్రేణి విద్యార్థి. ఇంటర్‌లో ఫెయిల్. అయినా పట్టు వీడలేదు. కష్టపడి చదివి.. ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. దాంతోనే సంతృప్తి చెందక ఉద్యోగానికి రాజీనామా చేసి మరీ సివిల్స్‌కు సన్నద్ధమయ్యారు. లక్ష్యానికి అనుగుణంగా ఐపీఎస్ అధికారి అయ్యారు. ఆయనే.. ఏపీలోని అనకాపల్లి జిల్లా కోటవురుట్ల మండలం పాములవాక గ్రామానికి చెందిన కిల్లాడ సత్యనారాయణ.ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్ ట్రాఫిక్ విభాగంలో అదనపు డీజీపీగా పనిచేస్తున్నారు. వృత్తిరీత్యా పోలీసు అధికారి అయినా... ప్రవృత్తి సాహిత్యం. 'ఆగ్రాలో ఏఎస్పీగా మొదటి పోస్టింగ్ వచ్చింది. ఎస్పీగా నక్సల్స్ ప్రభావిత జిల్లా సోన్‌భద్రాలో, డీఐజీగా మేరట్‌లో విధులు నిర్వర్తించా. కొన్నాళ్లపాటు ఏపీలోనూ డిప్యుటేషన్‌పై పనిచేశా. ఆయా రాష్ట్రాల్లో పనిచేస్తున్నప్పుడు అనేక ప్రాంతాల్లో పర్యటించాను. ఎన్నో అంశాలు తెలుసుకున్నాను. తర్వాత వాటి గురించి వ్యాసాలు రాయడం ప్రారంభించా. అలా సాహిత్యంపై మక్కువ పెరిగింది. ఇప్పటివరకు 8 పుస్తకాలు ప్రచురించాను' అని సత్యనారాయణ 'ఈనాడు'కు తెలిపారు.

## 'సింగరేణి' ప్రమాద బీమా పథకం దేశానికి ఆదర్శం




*** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్: సింగరేణి కార్మికులు, ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకం దేశానికి ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రామగుండం1 బొగ్గు గని ఏరియాలో సపోర్టుమెన్‌గా పనిచేస్తున్న పెండ్రి రంజిత్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు ఎస్‌బీఐలో వేతన ఖాతా ఉంది. సింగరేణి కార్మికుల వేతన ఖాతాలకు ప్రమాద బీమా పథకం అమలు చేస్తున్నారు. దాంతో ఆయన భార్య లతకు రూ.1.20 కోట్ల బీమా పరిహారం సొమ్ము చెక్కును శనివారం ప్రజాభవన్‌లో భట్టి అందజేశారు. కార్యక్రమంలో నవీన్‌మిత్తల్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ ప్రాజెక్టుల్లో వేగం పెంచాలి**

సింగరేణి సంస్థ చేపడుతున్న 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, 500 మెగావాట్ల పవన, 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ (పీఎస్‌పీ)ల పనుల్లో వేగం పెంచాలని ఉప ముఖ్యమంత్రి భట్టి అధికారులను ఆదేశించారు. శనివారం ప్రజాభవన్‌లో విద్యుత్ ప్లాంట్లపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... ''రిజర్వాయర్లలో ఏర్పాటు చేయనున్న ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లకు అనుమతుల కోసం నీటిపారుదల శాఖకు లేఖలు రాయాలి. ఐదు జిల్లాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన 500 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లకు సంబంధించిన డీపీఆర్‌లను జులై నెలాఖరుకల్లా సిద్ధం చేయాలి. మేడిపల్లిలో 500 మెగావాట్ల పీఎస్‌పీ నిర్మాణాన్ని తక్షణమే చేపట్టండి. రాజస్థాన్ విద్యుత్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 1,500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఆ రాష్ట్రంలోని సోలార్ వ్యాలీలో త్వరితగతిన ఏర్పాటు చేయాలి'' అని ఆదేశించారు. తెలంగాణలో సింగరేణి నిర్మించాల్సిన 800 మెగావాట్ల థర్మల్ ప్లాంటుపైనా చర్చించారు.

# మీ రోదసి యాత్ర.. నవశకానికి నాంది

(మొదటిపేజీ తరువాయి)

భవ్యంగా కనిపించింది'' అని పేర్కొన్నారు. మోదీ, శుభాంశుల మధ్య సాగిన 18 నిమిషాల సంభాషణలోని ముఖ్యాంశాలివీ..

మోదీ: శుభాంశు..! నేడు మీరు భారత భూభాగానికి చాలా దూరంలో ఉన్నప్పటికీ.. ప్రతి భారతీయుడి హృదయానికి అత్యంత దగ్గరగా ఉన్నారు. మీ పేరులో 'శుభం' ఉంది. అందువల్ల శుభప్రదమైన నవశకానికి మీ యాత్ర నాంది పలికింది. నా గొంతులో భారతీయుల ఉత్సాహం ఉంది. అంతరిక్షంలో భారతీయ జెండాను ఎగురవేసినందుకు మీకు నా హృదయపూర్వక అభినందనలు. అక్కడ అంతా బాగుందా? మీ ఆరోగ్యం ఎలా ఉంది?

శుభాంశు: మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలతో నేను ఇక్కడ క్షేమంగా, సురక్షితంగా ఉన్నా. ఇక్కడ చాలా బాగుంది. ఈ యాత్ర నాది మాత్రమే కాదు. దేశమంతటిదీ. ఇది నాకు పెద్ద అవకాశం. దేశానికి ప్రాతినిధ్యం వహించడం చాలా గర్వంగా ఉంది.

మోదీ: రోదసిలో మీరెన్నో పరిశోధనలు చేస్తున్నారు? రాబోయే రోజుల్లో వ్యవసాయం, ఆరోగ్యానికి మేలు చేసే ప్రయోగం ఏదైనా ఉందా?

శుభాంశు: గర్వంగా చెప్పగలను. మొదటిసారి భారతీయ శాస్త్రవేత్తలు ఏడు వినూత్న పరిశోధనలకు రూపకల్పన చేశారు. వాటిని ఐఎస్ఎస్‌కు తీసుకొచ్చా. మొదటి పరిశోధనను మూలకణాలపై చేపట్టాల్సి ఉంది. అంతరిక్షంలో గురుత్వాకర్షణ శక్తి ఉండదు. ఫలితంగా కండరాల క్షీణత చోటు చేసుకుంటుంది. ప్రత్యేక పదార్థం తీసుకోవడం ద్వారా కండరాల క్షీణతను నిలువరించటం లేదా దాన్ని జాప్యం చేయడంపై నా పరిశోధన దృష్టిపెడుతుంది. కండరాల క్షీణతతో భూమిపైన బాధపడే వృద్ధులకు ఈ ప్రత్యేక పదార్థం ఉపయోగపడుతుందేమో పరీక్షిస్తాం. రెండోది సూక్ష్మ ఆల్గే వృద్ధి ప్రయోగం. ఇక్కడ దాని వృద్ధిని చూస్తే ఆ ప్రక్రియను అనుసరిస్తే పెద్దమొత్తంలో అభివృద్ధి చేసి పోషకాలు అందించవచ్చు. ఇది ఆహార భద్రతకు కూడా ఉపకరిస్తుంది.

మోదీ: అక్కడి పరిస్థితులు ఎంత భిన్నంగా ఉన్నాయి. వాటికి ఎలా అలవాటుపడుతున్నారు?

శుభాంశు: ఇక్కడ అన్నీ భిన్నంగా ఉన్నాయి. ఏడాది శిక్షణ తీసుకున్నాను. మొత్తం వ్యవస్థలు, ప్రయోగాల గురించి మాకు తెలుసు. కానీ ఇక్కడికి రాగానే అకస్మాత్తుగా మొత్తం మారిపోయింది. భారరహితస్థితి కారణంగా ఇప్పుడు మీతో మాట్లాడుతున్నప్పుడు నా కాళ్లను కట్టుకున్నాను. లేదంటే పైకి వెళ్లిపోతాను. నీళ్లు తాగాలన్నా, నడవాలన్నా, నిద్రించాలన్నా కష్టం. సీలింగ్‌పైన, గోడలపై కూడా విశ్రమించొచ్చు. శిక్షణ బాగుంది. కానీ మారిన వాతావరణానికి అలవాటు పడడానికి ఒకటి రెండు రోజులు పడుతుంది.

మోదీ: సైన్స్, ఆధ్యాత్మికం భారత్ ప్రత్యేకతలు. స్పేస్ సెంటర్‌లో మనశ్శాంతి కోసం ధ్యానం ఏమైనా ఉపయోగపడుతోందా?

శుభాంశు: కచ్చితంగా ఉపయోగపడుతోంది. భారత్ ఇప్పటికే యోగా కార్యక్రమాలు చాలా చేస్తోంది. అంతరిక్షంలో మనశ్శాంతి ఉండదని చాలామంది అన్నారు. సాధారణ శిక్షణ తీసుకునేప్పుడు, రాకెట్ లాంచ్ సమయంలో చాలా ఒత్తిడికి గురయ్యా. ప్రతికూల పరిస్థితుల్లో ధ్యానం చాలా ఉపయోగపడుతుంది.

**అనుభవాలు నిక్షిప్తం చేసుకోండి**

''గగన్‌యాన్ మిషన్‌ను ముందుకు తీసుకెళ్లాలి. మన సొంత అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలి. చందమామపై భారత వ్యోమగామి దిగాలి. మీరు నేర్చుకున్న అంశాలు భవిష్యత్ యాత్రల్లో కీలక పాత్ర పోషిస్తాయి. మీ ప్రతి అనుభవాన్నీ జాగ్రత్తగా నిక్షిప్తం చేసుకుంటున్నారనుకుంటున్నా'' అని శుభాంశుకు మోదీ సూచించారు. ఒక స్పాంజీలా అన్ని అనుభవాలను ఒడిసి పడుతున్నానని శుభాంశు బదులిచ్చారు. చివర్లో మోదీ 'భారత్ మాతా కీ జై' అని నినదించగా.. శుక్లా కూడా ఆయనతో గొంతు కలిపారు.

# కంచ గచ్చిబౌలిలో ఐటీ టవర్లు నిర్మిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధి కల్పిస్తామన్నారు. గచ్చిబౌలి కూడలిలో దివంగత పి.జనార్దన్‌రెడ్డి ఫ్లైఓవర్‌ను శనివారం సీఎం ప్రారంభించారు. అనంతరం.. అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. ''హైటెక్‌సిటీకి అప్పటి సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేసినప్పుడు పీజేఆర్ మంత్రిగా ఉన్నారు. రాజీవ్‌గాంధీ టెక్‌పార్కును మహారాష్ట్రకు తరలించేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను పీజేఆర్ అడ్డుకున్నారు. పేదల అభ్యున్నతి కోసం శ్రమించిన ఆయనను ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాలన్న ఉద్దేశంతో ఈ వంతెనకు పీజేఆర్ పేరు పెట్టాం. హైటెక్‌సిటీకి కాంగ్రెస్ పునాది వేస్తే.. తర్వాతి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైబరాబాద్ పేరుతో నగరాన్ని అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లారు.

**నాగార్జున కూడా అభినందించారు..**

చెరువులు, నాలాలను సంరక్షించేందుకు హైడ్రాను ఏర్పాటు చేశాం. తమ్మిడికుంటలోని సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్‌కన్వెన్షన్ కూల్చివేతతో ఆక్రమణల తొలగింపు మొదలైంది. ఇటీవల నాగార్జున నన్ను కలిశారు. ఆయన భూమిని చెరువు సంరక్షణ కోసం ఇచ్చారు. హైడ్రా చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. అంబర్‌పేటలోని ఐదెకరాల బతుకమ్మకుంటను భారాస నేతల ఆక్రమణ నుంచి విడిపించి, చెరువును పునరుద్ధరించాం. మరిన్ని చెరువులకు కూడా జీవం పోశాం.

**అమిత్‌షాను కలుస్తాం**

అభివృద్ధి పనుల కోసం ఇప్పటికి 35 సార్లు దిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలను కలిశాను. ప్రాంతీయ వలయ రహదారి (ఆర్‌ఆర్‌ఆర్), మెట్రో రైలుకు, మూసీ నది అభివృద్ధికి నిధులివ్వాలని కోరినా.. కేంద్రం స్పందించట్లేదు. రాష్ట్రానికి వస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఆదివారం కలుసుకుంటాం. ఆయన దృష్టికి ఇవన్నీ తీసుకెళ్తాం.. నిధులు సాధించే వరకు వదిలిపెట్టం.

**100 రోజుల్లో ప్రణాళిక**

దిల్లీ నగరం కాలుష్యం కారణంగా నివాసయోగ్యత కోల్పోతోంది. ట్రాఫిక్ సమస్యతో బెంగళూరు, ముంబయి నగరాలూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. హైదరాబాద్‌లో ఆ పరిస్థితి రావొద్దు. కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రోడ్ల విస్తరణ, పై వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణమే లక్ష్యంగా హెచ్‌సిటీ ప్రాజెక్టు రూపొందించాం. కాలుష్యానికి కారణమవుతున్న మూడు వేల ఆర్టీసీ బస్సులను జిల్లాలకు ఇవ్వాలని, నగరంలో 100 శాతం విద్యుత్తు బస్సులు నడపాలని ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదేశించాం. ఆటో కార్మికులు సీఎన్‌జీ, బ్యాటరీ ఆటోలను కొనుక్కోవాలి. క్యాబ్‌లు నడిపే సంస్థలు, వ్యక్తులు కూడా విద్యుత్తు కార్లు వినియోగించడంపై దృష్టి పెట్టాలి. 100 రోజుల్లో నగరానికి బృహత్తర అభివృద్ధి ప్రణాళిక అందుబాటులోకి వస్తుంది. విమానాశ్రయం అవతల ఉన్న 30 వేల ఎకరాల్లో భారత భావి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నాం. అక్కడే క్రీడల విశ్వవిద్యాలయం, ఏఐ ఆధారిత పరిశ్రమలు, ఐటీ కంపెనీలతో.. కాలుష్యరహిత నగరం రూపుదిద్దుకుంటుంది'' అని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, మేయర్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# కమల దళపతి ఎవరో?

(మొదటిపేజీ తరువాయి)

కసరత్తు తుది దశకు చేరింది. అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం, పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలను కొత్త అధ్యక్షుని ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర సారథ్య బాధ్యతలపై భాజపా జాతీయ నాయకత్వం దాదాపుగా ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అధ్యక్ష పదవికి ప్రధానంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ పేర్లు వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేరును ఆరెస్సెస్‌తో పాటు కొందరు సీనియర్ నేతలు బలంగా ప్రతిపాదించినట్లు సమాచారం. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేరును కూడా చురుగ్గా పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**కొత్త అధ్యక్షుడు ఎప్పటి వరకు?**

ప్రస్తుత అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి స్థానంలో మరో నేతకు పగ్గాలు అప్పగించనుండగా కొత్త సారథి పదవీకాలం మూడు సంవత్సరాలు ఉంటుంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు మూడున్నర సంవత్సరాల వ్యవధి ఉంది. ప్రస్తుతం నియమించే అధ్యక్షుడినే అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగించాలా.. ఎన్నికల ముందు మరో నాయకుడిని అధ్యక్షుడిగా తీసుకురావాలా.. అన్న విషయంపైనా భాజపా జాతీయ నాయకత్వం చర్చించినట్లు తెలిసింది. రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికలో... ఈ రాజకీయ సమీకరణం కూడా ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు సారథ్య బాధ్యతలు అప్పగిస్తే అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగించే అవకాశం ఉంటుందన్న చర్చ జరుగుతోంది. మరో నేతకు అవకాశం ఇస్తే ఎన్నికల ముందు బండి సంజయ్‌కు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఇచ్చే ఆస్కారం ఉంటుందన్న అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో ఉన్నాయి. ఎన్నికల అధికారిగా శోభా కరంద్లాజే

అధ్యక్ష ఎన్నికకు భాజపా శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. ఆదివారం నోటిఫికేషన్ వెలువడనుంది. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న అధ్యక్షుణ్ని అధికారికంగా ప్రకటిస్తారు. ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసేందుకు కేంద్ర మంత్రి, పార్టీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి శోభా కరంద్లాజే ఆదివారం హైదరాబాద్ రానున్నారు. అధ్యక్షునిగా ఎన్నికయ్యే నేతకు ఆదివారం సాయంత్రం లేదంటే సోమవారం ఉదయం సంకేతాలు ఇవ్వనున్నట్లు తెలిసింది.

**బీసీకే అవకాశం!**

కాంగ్రెస్‌లో పీసీసీ అధ్యక్షుడు బీసీ వర్గం కావడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ వర్గం నేతకే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఇచ్చేందుకు అవకాశాలు అధికంగా ఉంటాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అదే కోణంలో నిర్ణయం తీసుకుంటే ఈటల, లక్ష్మణ్, అర్వింద్‌లలో ఒకరికి ఛాన్స్ దక్కుతుంది. లక్ష్మణ్ ఇప్పటికే ఓసారి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. నాయకుల మధ్య విభేదాల్లేకుండా సమన్వయం చేస్తారనే కోణంలో ఆయన పేరును పార్టీ ప్రముఖంగా పరిశీలిస్తోందని తెలిసింది. అయితే (తనకు ఆసక్తి లేదని ఆయన జాతీయ ముఖ్యనేతలకు చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని జాతీయ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటే ఈటల, అర్వింద్‌లలో ఒకరికి అవకాశం ఉంటుంది. కాంగ్రెస్‌ను ఎదుర్కోవడంతో పాటు బలమైన సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తే మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పేరూ తెరపైకి వచ్చే అవకాశం ఉంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేరుపై కూడా కొంతకాలం క్రితం చర్చ జరిగినట్లు తెలిసింది. కేంద్ర మంత్రిగా కొనసాగుతానని ఆయన చెప్పినట్లు సమాచారం.

# అందరికంటే అత్యుత్తమంగా ఉచిత బస్సు ప్రయాణం

(మొదటిపేజీ తరువాయి)

బస్సులన్నీ విద్యుత్‌వే ఉండాలని, ఇప్పుడున్న బస్సులనూ ఈవీలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు.

**అన్ని మోడళ్లనూ పరిశీలించండి**

'డీజిల్, విద్యుత్, సీఎన్జీ బస్సులు, బ్యాటరీ స్వాపింగ్.. ఇలా ఏ బస్సుల కొనుగోలు, నిర్వహణకు ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు రూపొందించండి. బ్యాటరీతో, బ్యాటరీ లేకుండా బస్సులు, ప్రైవేటు సంస్థలు సర్వీస్ స్టేషన్లను నిర్వహించడం, బస్సులు ఆపరేట్ చేయడం.. ఇలా ఏ విధానంలో ఖర్చు తగ్గుతుందో పరిశీలించాలి. ఆర్టీసీయే విద్యుదుత్పత్తి చేసి, దానిని బస్సులకు వినియోగించగలిగితే ఎంత మేరకు నిర్వహణ వ్యయం తగ్గుతుందో అంచనా వేయండి' అని సీఎం ఆదేశించారు. 'ఆర్థిక కష్టాలు అధిగమించాలంటే ఆర్టీసీ ఆదాయ మార్గాలు పెంచుకోవాలి. ఖర్చు ఎలా తగ్గించుకోవాలి? ఇతర ఆదాయ మార్గాలేంటని దృష్టిపెట్టాలి. బస్టాండ్లలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచడం మొదలుకొని.. ప్రయాణం వరకు అన్నింటా ప్రయాణికుల్లో సంతృప్తి పెరిగేలా నిర్వహణ ఉండాలి' అని సీఎం పేర్కొన్నారు.

*** 88.90 కోట్లకు పెరగనున్న మహిళల ప్రయాణాలు**

'రాష్ట్రంలో 2.62 కోట్ల మంది మహిళలు ఉన్నారు. వీరిలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఏటా మహిళల ప్రయాణాల సంఖ్య 43.06 కోట్లుగా ఉంది. ఉచిత బస్సుప్రయాణ పథకం అమలుచేస్తే, ఇది ఏటా 75.51 కోట్లకు పెరుగుతుంది. ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో మహిళల ప్రయాణాల సంఖ్య ఏటా 6.85 కోట్లు ఉండగా, అది 13.39 కోట్లకు పెరుగుతుంది. మొత్తంగా



ఉచిత బస్సు ప్రయాణ పథకంతో మహిళలు ఏడాదిలో 88.90 కోట్లసార్లు ప్రయాణించే వీలుంది. ప్రతి మహిళ వారానికి ఒకసారైనా ప్రయాణిస్తారు' అని అధికారులు సీఎంకు వివరించారు.ఈ పథకం అమలుకు అదనంగా 2,536 బస్సులు అవసరమని అధికారులు సీఎంకు తెలిపారు. ఇందుకు రూ.996 కోట్లు అవుతుందన్నారు. బస్టాండ్లలో తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, సమాచార బోర్డులు, ఇతర సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. ఈ సమీక్షలో రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు పాల్గొన్నారు.

*** వచ్చే వారం మరోసారి భేటీ**

ఈ పథకంపై సీఎం చంద్రబాబు వచ్చే వారం మరోసారి సమీక్ష నిర్వహించనున్నారు. ఈలోపు విద్యుత్ బస్సులు, సీఎన్‌జీ బస్సులు, బ్యాటరీ స్వాపింగ్.. తదితరాలపై అధ్యయనం చేసి నివేదికతో రావాలని సీఎం ఆదేశించారు. ఆర్టీసీలో ప్రస్తుతమున్న బస్సుల్లో 57% పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసులే. ఎక్స్‌ప్రెస్‌లు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు మరో 17% ఉన్నాయి. రాష్ట్రంలో పెద్ద నగరాలు లేకపోయినా సరే.. సీఎం చంద్రబాబు లేఖ రాయడంతో కేంద్రం స్పందించి.. 11 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 750 విద్యుత్ బస్సులను పట్టణ రవాణా కింద అందిస్తోంది.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక





## సమాచార శాఖ కమీషనర్ సంతాపం

సీనియర్ జర్నలిస్ట్ స్వేచ్ఛ అకాల మరణంపట్ల సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. చురుకైన జర్నలిస్టుగా, రచయితగా ఉన్న స్వేచ్ఛ మరణంతో రాష్ట్రం ఒక మంచి జర్నలిస్టును కోల్పోయిందని అన్నారు. స్వేచ్ఛ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రియాంక వ్యక్తంచేశారు.

## ఫ్యూచర్ సిటీ అదనపు బాధ్యతలు స్వీకరించిన డీటీసీపీ దేవేందర్ రెడ్డి

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ అదనపు పట్టణ ప్రణాళిక డైరెక్టర్గా డిటీసీపి ఎస్. దేవేందర్ రెడ్డిని నియమిస్తూ మెట్రోపాలిటన్ ఏరియా అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ సెక్రటరీ ఇలంబరితి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ మేరకు దేవేందర్ రెడ్డి శుక్రవారం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ అదనపు పట్టణ ప్రణాళిక డైరెక్టర్గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. దీంతో, డీటీసీపీ తో పాటు ఫ్యూచర్ సిటీ బాధ్యతలు కూడా నిర్వర్తించనున్నారు.



*** జులైలో ఫ్యూచర్ సిటీలో మరిన్ని నియామకాలు**

వచ్చే నెలలో ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో నియామకాలు ఊపందుకోనున్నాయని సమాచారం. ముఖ్యంగా GHMC, HMDA నుంచి లేఔట్ అనుమతులు, ప్లానింగ్, డెవలప్మెంట్ తదితర అంశాలపై పట్టున్న సీనియర్ అధికారులను నియమించే ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే, ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ తదితర కీలక అంశాలపై అధికారులు దృష్టి సారించారు.



## లారీ ఓనర్స్ సమస్యల పరిష్కారానికి మంత్రి, ఎంపీ సమక్షంలో చర్చ

*** ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారిని కలిసిన ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు**

విజయవాడ, జూన్ 28: (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ గారి సమక్షంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారినివారి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా లారీ ఓనర్లు తమకు ఎదురవుతున్న ప్రధాన సమస్యలు — క్రషర్ పరిశ్రమపై ఆధారపడి నడిచే లారీ వ్యాపార పరిస్థితులు, పెట్రోల్ ధరల పెరుగుదల వల్ల వ్యయ భారం, టోల్ గేట్ల వద్ద వేధింపులు, రోడ్ గ్రాంట్లు ఆలస్యం, మరియు ATS నెంబర్‌ల కారణంగా ఎదురవుతున్న సమస్యలను మంత్రి గారికి విన్నవించారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి గారు సమస్యలను గమనించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రవాణా రంగాభివృద్ధికి అవసరమైన విధానాలను రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.



## జిహెచ్ఎంసి కార్యాలయం ఎదుట ధర్నాకి దిగిన బిఆర్ఎస్ పార్టీ జిహెచ్ఎంసి కార్పొరేటర్లు

అంబర్ పేట,జూన్, 28 (సమయం న్యూస్) : మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపుమేరకు జిహెచ్ఎంసి కార్యాలయం ముందు ధర్నాలో పాల్గొన్న అంబర్ పెట్ కార్పొరేటర్ ఈ విజయ్ కుమార్ గౌడ్. ఈ సందర్భంగా కార్పొ రేటర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నిరుపేదల కోసం 5 రూపాయలకే అన్నపూర్ణ భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ అన్నపూర్ణ పేరును మార్చి ఇందిరా క్యాంటీన్ గా నామకరణం చేయడం దురదృష్టకరమని, ఆరు గ్యారంటీలు,అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా పేర్ల మార్పు చేయడం తగదని జిహెచ్ఎంసి కార్యాలయం ముందు తన నిరసనని తెలియజేశారు.

## యాప్రాల్ లో రోటరీ తపాడియా డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం

నేరెడ్మేట్, జూన్ 28 : యాప్రాల్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ (3150) ఆధ్వర్యంలో 'రోటరీ తపాడియా ఛారిటబుల్ డయాగ్నోస్టిక్' సెంటర్ శనివారం యాప్రాల్‌లోని శ్రీ రంగనాథస్వామి ఆలయ కమ్యూనిటీ సెంటర్‌లో ప్రారంభమైంది. రోటరీ ఫౌండేషన్ గ్లోబల్ గ్రాంట్స్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం, సామాన్య మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ (3150) గవర్నర్ కే. శరత్ చౌదరి ఈ సెంటర్‌ను లాంఛనంగా



ప్రారంభించి, యాప్రాల్‌లో రోటరీ చేపట్టిన నాలుగవ సేవా కార్యక్రమం ఇదేనని తెలిపారు. ఈ డయాగ్నోస్టిక్ ల్యాబ్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయని, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటుకు రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మిడ్‌టౌన్, రోటరీ క్లబ్ ఆఫ్ నస్పా సన్‌షైన్‌తో పాటు రోటరీ క్లబ్స్ ఆఫ్ గ్లోబల్ విజార్డ్స్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎలైట్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంటెనియల్ వంటి పలు రోటరీ క్లబ్‌లు సహకరించాయి. ఈ సహకారం వల్ల స్థానిక ప్రజలకు తక్కువ ధరలకే డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులోకి వచ్చి, వారి ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు అమర్‌దీప్ సింగ్, నిధి ఆనంద్, మోస్, ద్యూరన్ హ్యూమ్స్, వివేక్ టిబ్రివాలా, బాబాకిషోర్ ముత్తా, వెంకటరాజు, ప్రభాకర్, డా. టపాడియాలతో పాటు పలువురు రోటరీ క్లబ్ సభ్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మైక్ సౌండ్ బహుకరణ

*** దాతాల ఔదార్యం.**

రాయపోల్, జూన్28 : లయన్స్ క్లబ్ అప్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని పెద్ద ఆరేపల్లి ప్రాథమిక పాఠశాలకు మైక్ సౌండ్ పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా లైయన్స్ క్లబ్ స్నేహ గజ్వేల్ అధ్యక్షులు మల్లేశం గౌడ్,ట్రెజరీ సత్యనారాయణ లు మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృత కార్యక్రమాలకు వివిధ రకాల పాఠశాల



నిర్వహించే కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడే విధంగా ఉండేటట్లు పాఠశాలకు మైక్ సెట్ ను అందజేయడం జరిగిందన్నారు. దీని విలువ సుమారుగా రూ.7500 లు ఉంటుందని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు రావడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు, పాఠశాలకు,గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థులు అందరూ కూడా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి మంచి పురోగతి సాధించాలన్నారు. భవిష్యత్తులో కూడా పేద బడుగు,బలహీన వర్గాలు చదువుకునే పాఠశాలలకు మా క్లబ్ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. చంద్రశేఖర్, ఉపాధ్యాయుని బృందం విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## "వన మహోత్సవం" లక్ష్య సాధనకు సమిష్టిగా కృషి చేయాలి

*** కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**

*** ఇందిరమ్మ ఇళ్లు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఎల్.ఆర్.ఎస్ పై సమీక్ష**

నిజామాబాద్, జూన్ 28(సమయం న్యూస్): వన మహోత్సవంలో భాగంగా నిర్దేశిత గడువు లోపు లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేలా సమగ్ర ప్రణాళికతో సమాయత్తం కావాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నాటిన మొక్కలు సంరక్షించబడేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. వన మహోత్సవం లక్ష్య సాధనకు ఆయా శాఖలు సమిష్టిగా కృషి చేయాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు, ఎల్.ఆర్.ఎస్ అనుమతుల మంజూరు అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. గత సంవత్సరం వన మహోత్సవం లో భాగంగా నాటిన మొక్కల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. నాటిన వాటిలో ఎన్ని మొక్కలు బ్రతికాయి, ఎన్ని చనిపోయాయి అన్నది పరిశీలించి, చనిపోయిన వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మొక్కలు నాటిన ప్రతి చోట వివరాలతో కూడిన నేమ్ బోర్డు ఉండాలన్నారు. ప్రస్తుత సీజన్ లో మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారిస్తూ, ఎస్టిమేట్ లు జనరేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మొక్కల పంపిణీ కోసం నర్సరీలను సిద్ధం చేస్తూ, వాటిని నాటేందుకు నిర్దేశిత ప్రదేశాలలో గుంతలు తవ్వించాలని అన్నారు. నాటిన ప్రతి మొక్క బ్రతికేలా పక్కాగా సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. బ్లాక్ ప్లాంటేషన్ లలో మొక్కలు నాటే కార్యక్రమాలలో విద్యార్థులను భాగస్వాములు చేస్తూ, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి అట్టహాసంగా వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. నిర్ణీత గడువు లోపు నూటికి నూరు శాతం మొక్కలు నాటే లక్ష్యం పూర్తి కావాలని అన్నారు.

*** ఫ్రై డే - డ్రై డే ప్రతి చోట అమలయ్యేలా చూడాలి**

కాగా, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని నివాస ప్రాంతాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం తప్పనిసరిగా అమలయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.



దోమల నివారణ కోసం ప్రతి ఆవాసంలో తప్పనిసరిగా ఫాగింగ్ జరిపించాలన్నారు. మురికి నీటి గుంతలలో ఆయిల్ బాల్స్, మంచినీటి వనరులతో కూడిన వాటిలో గంబూషియా చేప పిల్లలను వదలాలని సూచించారు. డెంగ్యూ మలేరియా విష జ్వరాలు వంటివి ప్రబలకుండా ముందస్తుగానే అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎక్కడైనా పాజిటివ్ కేసులు నమోదైతే, పరిసర ప్రాంతాలలో తప్పనిసరిగా నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు నియంత్రణ చర్యలు చేపట్టారా లేదా అన్నది సూపర్వైజరీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని కలెక్టర్ సూచించారు. రాపిడ్ రెస్పాన్స్ బృందాలు తక్షణమే స్పందించేలా చూడాలన్నారు. కాగా, ప్లాట్ల (ఇంటి స్థలాల) క్రమబద్ధీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన క్రమబద్ధీకరణ పత్రాలు అందించాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ నెలాఖరు వరకు ఎల్.ఆర్.ఎస్ రాయితీ అమలులో ఉన్నందున, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపుతూ లబ్ధిదారులను ప్రోత్సహించాలని అన్నారు. మంజూరీలు పొందిన లబ్ధిదారులందరూ వెంటనే పనులు ప్రారంభించేలా తగిన తోడ్పాటు అందించాలని సూచించారు. వారం రోజులలో ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, డీఆర్డీఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ అధికారి నివర్తి, డిఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, డీసీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా చర్యలు

**: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

*** పాఠశాలలకు రెగ్యులర్ గా ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాలి**

*** కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెడ్ మాస్టర్ లతో విద్య పై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి, జూన్ 28:(సమయం న్యూస్) : ప్రస్తుత విద్యా సంవత్సరంలో 90% విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శ్రీరాంపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెడ్ మాస్టర్ లతో విద్య పై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో



మౌలిక వసతుల కల్పన, పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభం లోనే లక్ష్యాలను నిర్దేశించుకోని వాటి సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ సర్కులర్ ప్రకారం పాఠశాలలో 10 శాతం కంటే ఎక్కువ ఉపాధ్యాయులు ఒకే రోజు సెలవు తీసుకోకుండా చూడాలని అన్నారు. ఉపాధ్యాయుల హాజరు పక్కాగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మరమ్మత్తులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులు చేశామని, ఎక్కడైనా ఇంకా అవసరం ఉంటే ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. రాబోయే వర్షాకాలం నేపథ్యంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. వచ్చేది వర్షాకాలం కావున మధ్యాహ్న భోజనం నాణ్యత లో పరిశుభ్రంగా ఉండేలా, వండే వంటలు క్వాలిటీ గా ఉండాలని, పాఠశాలలో పిచ్చి మొక్కలు ఉంటే వెంటనే తొలగించాలని అన్నారు. విద్యార్థుల నాణ్యత ప్రమాణాలు పెంచేందుకు ప్రణాళిక ప్రకారం పని చేయాలని అన్నారు. తెలుగు, ఇంగ్లీష్ చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ వంటి కనీస విద్యా ప్రమాణాలు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొంతమంది విద్యార్థులు చదువుతున్నారు కానీ అది అర్థం చేసుకోలేక పోతున్నారని,దీనిని అధిగమించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చోరువ చూపి పని చేయాలని అన్నారు. ప్రతి 2 నెలలకు కాంప్లెక్స్ పరిధిలో రివ్యూ సమావేశాలు నిర్వహించాలని, వీటిని పకడ్బందిగా నిర్వహించాలని అన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపు పై సమావేశాలు పెట్టుకోవాలని అన్నారు. 90 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా మనం పని చేయాలని, దీనికి అనుగుణంగా అవసరమైన ప్రణాళికలను పాఠశాల పరిధిలో సిద్ధం చేసుకోవాలని అన్నారు.

# చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులలో వేగం పెంచాలి

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాల పల్లి జూన్28 (సమయం న్యూస్) : శనివారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో చిన్న కాళేశ్వరం పనులు ప్రగతిపై ఇరిగేషన్ , ఫారెస్ట్, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు మెగా కంపెనీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులలో వేగం పెంచాలని తెలిపారు. ఆధునీకరణలో ఉన్న చెరువుల, కాలువల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంపు హౌస్ పనులను సైతం వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. భూ సేకరణ సమస్యలు ఉన్న గ్రామాల్లో లో గ్రామ సభలు నిర్వహించి గ్రామస్థులతో తీర్మానం చేయించాలని, భూసేకరణ పూర్తి అయిన గ్రామాలలో పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సోమవారం నుండి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులలో పురోగతిని పరిశీలించి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, ఇరిగేషన్ ఈ.ఈ సూర్య ప్రకాష్, మెగా కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కమిషనర్ ను కలిసిన నాయకులు

గుమ్మడిదల , జూన్ 28, సమయం న్యూస్ : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ ను శనివారం స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ దశరథ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, స్థానికుల సహకారాలు ఎంతో అవసరమని, అందరి సహకారంతో మున్సిపాలిటీలో మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల తాజా మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, మొగులయ్య, కొండల్ రెడ్డి, సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి , నర్సింలు, మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

# మహబూబాబాద్, కురవి, మండలాలు, జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

- **ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, విద్యాబోధనలు,వైద్య ఆరోగ్య సేవలను పరిశీలించిన**
- **: జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్ జూన్ 28 (సమయం న్యూస్) : శనివారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ మండలం సంద్రాలగూడెం, కురవి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి ఇందిరమ్మ కమిటీలు ప్రభుత్వ సూచనలు ప్రకారం జిల్లాలో వేగంగా పనులను ప్రారంభించి, ఇండ్ల నిర్మాణానికి జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకొని ముందుకు సాగుతుందన్నారు. స్వయం సహాయక బృందాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి ఇంటి నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందన్నారు, ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇంటి నిర్మాణానికి కావాల్సిన అన్ని వసతులను క్షేత్రస్థాయిలో సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మార్కింగ్ భూమి పూజ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అధికారులు పాల్గొని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తగిన సూచనలు సలహాలు అందించి ఇండ్ల నిర్మాణం కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు, రాష్ట్రంలోనే జిల్లాను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పథకం లబ్ధిదారులకు సొంత ఇంటి నిర్మాణం కోసం సంబంధిత అధికారులందరూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వేసవి సెలవుల అనంతరం జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా జిల్లాలో అన్ని విద్యాసంస్థలలో అధికంగా అడ్మిషన్స్ కల్పించామని జిల్లా విద్యాశాఖ యంత్రాంగం ప్రభుత్వ సూచించిన ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న పిల్లలందరికీ అత్యుత్తమ విద్య బోధనలు అందించాలని, సబ్జెక్టుల నైపుణ్యత విద్యార్థుల స్థితిగతులను పరిశీలిస్తూ క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం ఎగ్జామ్స్ నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు,



నాణ్యమైన ఆహార పదార్థాలతో మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యతోపాటు సాంస్కృతిక క్రీడల్లో వారికి శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు, వసతి గృహాలలో చదువుతున్న వారికి మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్ మధ్యాహ్న భోజనం స్నాక్స్ డిన్నర్ లను అందించాలని, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా విద్యార్థుల యొక్క హెల్త్ ప్రొఫైల్ మెయింటైన్ చేయాలని పాఠశాలలు వసతి గృహాలలో క్రమం తప్పకుండా సానిటేషన్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల మార్పు వలన సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, హెల్త్ సబ్ సెంటర్స్ లవారీగా ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులను రికార్డులను మైంటైన్ చేస్తూ ఒకసారి ఉన్నచోట వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాత శిశు మరణాలను తగ్గించాలని, సీజనల్ వ్యాధులు మలేరియా డెంగ్యూ చికెన్ గునియా తదితర విష జ్వరాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై ప్రత్యేక దృష్టి పెట్టి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక ఎంపిడిఓ రఘుపతి రెడ్డి, కురవి తహసిల్దార్ బి.విజయ, సంబంధిత అధికారులు ఉన్నారు.





## ఎల్బీ స్టేడియంలో రాజపుత్ క్షత్రియ క్రికెట్ టోర్నమెంట్ 2025 ప్రారంభించిన చైర్మన్ శివసేనారెడ్డి

అంబర్ పేట, జూన్ 28 (సమయం న్యూస్) : సామాజిక సంస్థలు విరివిగా క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఆరోగ్యంతో పాటు ఐక్యత ఏర్పడుతుందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు ఆరోగ్యానికే కాక ఐక్యతకు కూడా దోహదం చేస్తాయని, వివిధ సామాజిక సంస్థలు నిర్వహించే క్రీడా కార్యక్రమాలు ఆయా సంస్థల బలోపేతానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. రాజపుత్ క్షత్రియ సమాజ్ యువకుల కొరకు రెండు రోజుల పాటు క్రికెట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడా కార్యక్రమాలు నిర్వహించే వివిధ సామాజిక సంస్థలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని రకాల సహాయం చేస్తుందని అన్నారు. నూతన క్రీడా విధానం రాష్ట్రంలోని అన్ని స్టేడియాలు క్రీడా కార్యక్రమాలతో కలకలలాడాలన్న సంకల్పంతోనే సీఎం రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు మనీష్ సింగ్, అభిషేక్, సుహాన్క్ ఆశిష్ షాహీన్,అనిరుద్,కుల్దీప్ రాహుల్, సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి

* **ఎం.ఈ.ఓ లు ఖచ్చితంగా పాఠశాలలను సందర్శించాలి**
* **ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అంనిందించాలి**
* **జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్, జూన్ 28 (సమయం న్యూస్) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్లోని ఎన్.ఐ.సి వి.సి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మండలాల వారిగా ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాటశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్యను, నివేదికలను పరిశీలిస్తూ.. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతి విద్యార్థి యొక్క చదువుపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రత్యేకమైన బోధనా పద్ధతులను అవలంబించి విద్యార్థులకు చదువు నేర్పించాలని అన్నారు. ఎందులోనైతే విద్యార్థులు వెనుకబడి ఉంటారో అట్టి అంశాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో చదువు చెప్పాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు వారి వారి సబ్జెక్టులకు సంబంధించిన హోంవర్క్ చేస్తున్నారా లేదా అనే విషయాన్ని ఉపాధ్యాయులు గమనించి తగిన సూచనలు చేయాలన్నారు. మండలాలలో ప్రతి ఎంఈఓ ప్రతిరోజు కనీసం ఒక పాఠశాలను సందర్శించవలెనని, సందర్శనలో విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలు మరియు చదవడం మరియు రాయడం తప్పనిసరిగా పరీక్షించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు ఇవ్వాలని, టైం టేబుల్ ప్రకారం సిలబస్ ను పూర్తి చేయాలని, పూర్తి చేసిన సిలబస్ లోని పాఠాలపై విద్యార్థుల సామర్థ్యాన్ని ఒకటికి రెండు సార్లు పరీక్షించాలని అన్నారు. వరుసగా గైరహాజరవుతున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారు పాఠశాలలకు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకొనవలెను. విద్యార్థులందరూ 100 శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకొనవలెనన్నారు. సక్రమంగా హాజరు కాని ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## హిందూ శ్మశాన వాటికను సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్ పేట, జూన్,28 (సమయం న్యూస్) బాగ్ అంబర్‌పేట్ హిందూ శ్మశాన వాటికను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సందర్శించారు. ఆయనతో పాటు కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి కూడా పాల్గొన్నారు. శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంత్యక్రియలకోసం వచ్చే ప్రజలకు అవసరమైన ప్రాథ మిక సౌకర్యాలు తప్పకుండా అందు బాటులో ఉండాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ శ్రీమతి ప్రసాంతి, డివిజన్ అధ్యక్షుడు శ్రీ చంద్ర మోహన్, ఇతర సీనియర్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మంత్రిని కలిసిన బొల్లారం నాయకులు

జిన్నారం, జూన్ 28, సమయం న్యూస్ : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని శనివారం బొల్లారం కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, పటాన్చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ గారి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు .ఇటీవల జిల్లా ఇన్చార్జి మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా చంద్రారెడ్డి మంత్రి గడ్డం వివేక్ ను ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారిశ్రామికవాడలో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు .పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పిఎఫ్ సేవలు అదేవిధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గోపాలమ్మ, గోవర్ధన్ గౌడ్, సంపత్ రెడ్డి , రాజు , చక్రపాణి, భాస్కర్ ,బషీర్ , ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.



## బడి బాట షురూ చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

* **ప్రభుత్వ పాఠశాలల తనిఖీ,మధ్యాహ్నం భోజన పరిశీలన ప్రారంభం**

జనగాం జిల్లా జిల్లా జూన్ 28 (సమయం న్యూస్) : ప్రభుత్వ పాఠ శాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు జిల్లా విద్యాశాఖ బడి బాట నిర్వహిస్తే ఇక ఇప్పటి నుండి విద్యార్థులకు అందుతున్న భోదన తీరు, వారి సామర్థ్యాలను అలాగే వారికి అందుతున్న పౌష్టికాహార నాణ్యతను పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బడి బాట పట్టారు. ప్రభుత్వ పాఠశాల తనిఖీ, పర్యవేక్షణను షురూ చేసారు. గత విద్యా సంవత్సరంలో.. జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల నిరంతర పర్యవేక్షణ, పరిశీలన,రివ్యూ లతో పదవ తరగతి పరీక్షల్లో జిల్లా.. రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలబడిన విషయం తెలిసిందే.. ఈసారి మొదటి స్థానం లో జిల్లా... ఉండేలా కలెక్టర్ విద్యా శాఖ అధికారులను సన్నద్ధం చేస్తున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

- **విద్యుత్ ఏఈ శ్రీ నివాస్ రావు.**

రాయపోల్, జూన్28 : రాయపోల్ దౌల్తాబాద్ మండలం పరిధిలోని ముబారాస్ పూర్ (33)11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇందుకు వినియోగదారులు సహకారం అందించాలని రాయపోల్ మండల విద్యుత్తు ఏఈ శ్రీ నివాస్ రావు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ముబారాస్ పూర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మోయింటనెన్స్, గృహా,వ్యవసాయ విద్యుత్ మోయింటనెన్స్ పనులు ఉండడం వలన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుందని ఆయన విద్యుత్తువినియోగదారులకు సూచించారు. ముబారాసు పూర్ సబ్ స్టేషన్ పరిధిలో రాయపోల్ మండల పరిధిలో గల గ్రామాలన్నింటికీ గృహ మరియు వ్యవసాయ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోదారులు, రైతులు విద్యుత్ సంస్థకు సహకరించగలరని ఆయన పేర్కొన్నారు.

# ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి

జిన్నారం, జూన్ 28, సమయం న్యూస్ : మండల కేంద్రమైన జిన్నారంలో ఏర్పాటు అవుతున్న జూనియర్ సివిల్ జడ్జ్ కం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాన్ని జిల్లా న్యాయమూర్తి భవాని చంద్ర శనివారం పరిశీలించారు. జిన్నారం మండలానికి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంజూరు కావడంతో, మండల కార్యాలయ సమీపంలో తాత్కాలిక భవ నానికి 8.4 లక్షల రూపాయలతో మర మ్మత్తులు చేసి భవనాన్ని అందుబాటులోకి తేవడం జరిగింది.ఇట్టి కోర్టు భవనాన్ని శనివారం నర్సాపూర్, పఠాన్ చెరువు న్యాయవాదులతో కలిసి జిల్లా న్యాయమూర్తి భవాని చంద్ర పరిశీలించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే కోర్టు భవనాన్ని ప్రారంభిస్తామని ఆమె తెలిపారు .అన్ని సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది జాఫర్, న్యాయవాదులు ఆర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్, బాలకిషన్,



సత్యనారాయణ, నర్సాపూర్ ఏజీపి సుధాకర్, మాజీ ఏజీపి సత్యనారాయణ, ప్రభు, వెంకట్రామిరెడ్డి ,రాజు నాయక్, మధుశ్రీ ,పూర్ణచంద్ర గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గంగు రమేష్, మాజీ సర్పంచ్ జింకల శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## ద్విచక్ర వాహనం చోరీ

రాయపోల్ ,జూన్ 28 రాత్రి సమయంలో ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన ఓ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి దొంగలించారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రం రాయపోల్ గ్రామానికి చెందిన గూని మహేష్ కు చెందిన TS 36,6977 హెచ్ఎఫ్ డీలక్స్ బ్లాక్ కలర్ ద్విచక్ర వాహనం రాత్రి సమయంలో ఇంటి వద్ద పార్క్ చేసి ఉంచాడు. తెల్లారి లేచి చూసేసరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి శనివారం మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రఘుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

* **బొల్లారం సిఐ ఎం. రవీందర్ రెడ్డి**
* **జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్లో నాయకత్వ పట్టాభిషేక కార్యక్రమం**




జిన్నారం, జూన్ 28, సమయం న్యూస్ : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలనీ, లీడర్షిప్ అనేది పదవి కాదని, అది ఒక బాధ్యత అని బొల్లారం సిఐ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఫౌండర్ సతీష్ కుమార్, చేర్మెన్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో సిఐ రవీందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని సూచించారు. నాయకుడంటే పదవి కాదని బాధ్యత అని పేర్కొన్నారు. క్రమశిక్షణ ,పట్టుదల అంకితభావం తో పాటు అన్ని విషయాల్లో అందరికీ ఆదర్శంగా నిలబడిన వ్యక్తి నాయకుడు అన్నారు. బాలికలు, బాలుర తరుపున ఎంపికైన విద్యార్థి నాయకులను సిఐ పాఠశాల యాజమాన్యంతో కలిసి అభి నందించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని, వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులు,పాఠశాల యజమాన్యం, సిబ్బందితో సిఐ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీఐను స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ స్మిత భోగరాజు, ప్రిన్సిపాల్ ద్రాక్షాయని, వైస్ ప్రిన్సిపల్ నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్టిపి ప్లాంట్ స్థల పరిశీలన

* **జిన్నారం తహసిల్దార్ దేవదాసు**

జిన్నారం, జూన్ 28, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 268లో ఏర్పాటు చేస్తున్న ఎస్టిపి ప్లాంట్ ను శనివారం జిన్నారం తహసిల్దార్ దేవదాసు సందర్శించారు. పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గారి సహకారంతో సర్వే నంబర్ 268 లో 10 ఎకరాల విస్తీర్ణంలో 62 కోట్ల అంచనా వ్యయంతో మురుగునీటి శుద్ధి కర్మాగారం (ఎస్టిపి) కొరకు అలాన్మెంట్ చేసిన స్థలాన్ని జిన్నారం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ, సర్వేయర్ సంగీత లతో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జడ్పిటిసి సభ్యులు కోలాన్ బాల్ రెడ్డి కౌన్సిలర్లు కిరణ్ కుమార్ రెడ్డి, బీరప్ప యాదవ్, శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### పారిశుధ్యం, మరియు ప్రజారోగ్యం, మున్సిపాలిటీ అభివృద్ధి

# ప్రధాన ఎజెండాగా రాష్ట్ర ప్రభుత్వ పటిష్ట చర్యలు

* **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్, జూన్28, (సమయం న్యూస్) : నర్సాపూర్ మున్సిపాలిటీ శానిటేషన్, మౌలిక వసతులు, కల్పన అభివృద్ధి దిశగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం. పట్టణ ప్రజలు బాధ్యతగా మెలిగి పరిసరాల పరిశుభ్రతలో మున్సిపాలిటీ సిబ్బందితో తమ వంతు భాగస్వాములు కావాలి. పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం. మున్సిపాలిటీలు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి. ప్లాస్టిక్ రహితం మున్సిపాలిటీ అనేది వైన్ షాపుల నుండి ప్రారంభం కావాలి. వైన్ షాపులు నిర్వాహకులు ప్లాస్టిక్ విచ్చలవిడిగా షాపులు ముందు పారవేసిన సందర్భంగా 5000 రూపాయలు ఫైన్ విధించాలని మున్సిపల్ కమిషనర్ను ఆదేశించిన కలెక్టర్ నర్సాపూర్ మున్సిపాలిటీలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివిధ వార్డులలో విస్తృతంగా పర్యటించిన సమస్యలు అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత మున్సిపాలిటీ అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నర్సాపూర్ మున్సిపాలిటీలో వివిధ వార్డులలో సంబంధిత మున్సిపల్ సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించారు. వార్డులలో సమస్యలు, ప్రజారోగ్య పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రైతు మునిసిపాలిటీ ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని వార్డులలో పర్యటిస్తూ శానిటేషన్ సిబ్బందికి, మున్సిపల్ అధికారులకు, పట్టణ ప్రజలకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో మున్సిపల్ సిబ్బందికి సహాయ సహకారాలు అందించాలని, ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటింటికి చెత్త బండి వచ్చినప్పుడు తడి చెత్త పొడి చెత్త వేరు చేసి అందించాలని, వివిధ షాపుల యజమానులు, మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న స్థలాలలో చెత్త వేయరాదని తప్పనిసరిగా మున్సిపల్ సిబ్బందికే అందించాలన్నారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా నర్సాపూర్ మున్సిపాలిటీ తీర్చిదిద్దే విధంగా ప్రజలు అధికారులు భాగస్వాములై ప్లాస్టిక్ నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ అనేది వైన్ షాపులు నుండే ప్రారంభం కావాలన్నారు వార్డులలో ఉన్న సమస్యలను చేపట్టవలసిన కార్యచరణ పై ప్రతిపాదన సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తద్వారా నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా ముందుకు పోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవు

* **జిన్నారం తహసిల్దార్ దేవదాసు**
* **జిన్నారం ఎస్సై నాగలక్ష్మి**

జిన్నారం, జూన్ 28, సమయం న్యూస్ : ప్రభుత్వ భూమి నుండి అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవని జిన్నారం మండల తహసిల్దార్ దేవదాసు శనివారం అన్నారు .జిన్నారం మండలంలోని రాళ్లకత్వ గ్రామంలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 286లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయం తెలుసుకున్న మండల తహసిల్దార్ దేవదాసు, జిన్నారం ఎస్సై నాగలక్ష్మి లు అక్కడికి చేరుకొని స్థల పరిశీలన చేశారు .ఈ సందర్భంగా అక్రమంగా మట్టి తరలిస్తున్న రైతులతో మాట్లాడుతూ ,ఇకముందు ఎవరైనా అక్రమంగా మట్టిని తరలించినట్లయితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన అన్నారు. ప్రభుత్వం చే జారీ చేయబడిన అసైన్డ్ భూమిని పిఓటి గా మరియు చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జయ ప్రకాష్ నారాయణ, సర్వేయర్ సంగీత, నాయకులు రామకృష్ణ,, గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.

**ప్రహరీ గోడ కూల్చివేత**

కొడకంచి గ్రామంలోని సర్వే నంబర్ 5 ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రహరీ గోడను తొలగించిన రెవెన్యూ అధికారులు. ఇకపై తదుపరి ఇలాంటి నిర్మాణాలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

* **పి. ప్రావీణ్య జిల్లా కలెక్టర్**
* **నిర్మాణంలో ఉన్న తాగునీటి పథకాలు వేగంగా పూర్తి చేయాలి**
* **ప్రభుత్వ గురుకుల పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాల కు తాగునీటి సరఫరా చేయాలి**
* **నీటిపారుదలశాఖ, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష**



సంగారెడ్డి జూన్28(సమయం న్యూస్) : జిల్లాలో తాగునీటి సమస్యలు లేకుండా , అన్ని ఆవాస ప్రాంతాలకు తాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం లో జిల్లాలోని మంజీరా బ్యారేజీ, సింగూర్ ప్రాజెక్టు నుండి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ కు సరఫరా అవుతున్న తాగునీటి వివరాలను, మంజీరా బ్యారేజ్ పరిస్థితి , నారింజ వాగు , సింగూర్ పరివాహక ప్రాంతం, వివరాలు, నూతనంగా చేపట్టిన చెరువుల కుంటల నిర్మాణం పనుల పురోగతి , తాగునీటి సరఫరాల పై నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్. అధికారులతో జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య , సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం బ్యారేజీల నీటిమట్టాలు ఎంత ఉన్నాయి, నీటి సరఫరా కొనసాగే పరిస్థితి , మిషన్ భగీరథ ,నీరు సరఫరా అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ ,నీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని జరాసంఘం, న్యాల్కల్ మండలాలలో అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులు వెంటనే పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని గురుకుల సంక్షేమ పాఠశాలలో వసతి గృహాలు అంగన్వాడీ కేంద్రాలకు తాగునీరు సరఫరాయి మంచినీటి కనెక్షన్లు ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని లీకేజీలకు అవసరమైన మరమత్తు పనులు వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రజలకు అన్ని ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పట్టణాలలో, గ్రామాలలో వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని చేపట్టారు. మురుగునీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధులు వల్ల కలిగే సమస్యలను ప్రజలకు వివరించి అవసరమైన జాగ్రత్త చర్యలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,మిషన్ భగీరథ డి ఈ రఘువీర్, ,ఏ ఏ పాషా , ఈ ఈ పబ్లిక్ హెల్త్ కృష్ణ మోహన్, నీటిపారుదల శాఖ అధికారులు, మున్సిపల్ ఇంజనీర్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రభుత్వంలో 3వ ఫ్లై ఓవర్ ప్రారంభం

హైదరాబాద్, జూన్ 28( సమయం న్యూస్:) హైదరాబాద్ నగరంలో ఎస్.ఆర్.డి.పి ద్వారా చేపట్టిన ఫ్లైఓవర్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3వ ఫ్లై ఓవర్ ను శనివారం ప్రారంభించారు. బైరామల్ గూడ 2 లెవెల్ ఫ్లై ఓవర్, నగరంలోనే అతిపెద్ద ఆరాంఘర్ నుండి జూ పార్కు వరకు చేపట్టిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫ్లై ఓవర్, ఓఆర్ఆర్ నుండి కొండాపూర్ పీజేఆర్ (శిల్ప లే ఔట్ సెకండ్ ఫేస్) ఫ్లై ఓవర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. దీంతో మూడు



ఫ్లైఓవర్ లు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. గతంలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కే టి ఆర్ ప్రారంభించేవారు. ప్రస్తుత పురపాలక ,పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యమంత్రి గారి పరిధిలో ఉన్నందున ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి ప్రారంభించడం జరిగిందని చెప్పవచ్చు.

epaper.samayamdaily.net
APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక
www.samayamdaily.net





## 12 వ ర్యాంక్ సాధించిన నీలగిరి సాయి మిత్రను సన్మానించిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా

ఆదిలాబాద్ జూన్28(సమయం న్యూస్) : తలమడుగు మండల కేంద్రానికి చెందిన నీలగిరి మీనాక్షి, అశోక్ దంపతుల కుమార్తె సాయి మిత్ర తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలో 12వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా పాలనాధికారి తన ఛాంబర్ లో సాయి మిత్ర ను శాలువాతో సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యకు సంబంధించి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కుటుంబ సభ్యులు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, మాజీ జడ్పీటీసీ గణేష్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## సోలార్ పవర్ ప్లాంట్ కోసం స్థల పరిశీలన

గుమ్మడిదల, జూన్ 28, సమయం న్యూస్ : ఇందిరా మహిళా శక్తి పీఎంకుసుమ్ సోలార్ పవర్ ప్లాంట్ స్థాపన కోసం శనివారం రాష్ట్రస్థాయి సెర్ఫ్, నాబార్డ్ ప్రతినిధుల బృందం గుమ్మడిదల మండలం నల్ల వల్లి గ్రామంలో కేటాయిం చిన ప్రభుత్వ భూమిని, విద్యుత్ సబ్ స్టేషన్ ను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా నల్లవల్లి మహిళా సంఘాల సభ్యులకు తగు సూచనలను ఇవ్వడం జరిగింది. ప్రాజెక్టు స్థాపనకు త్వరలోనే విధివిధానాలు ఖరారు చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెర్ఫ్ డైరెక్టర్ కృష్ణారావు, నాబార్డ్ ఏపీఎం రామా రావు, కన్సల్టెంట్ రామకృష్ణ, రెడీకో డిస్టిక్ మేనేజర్ రవీందర్ చౌహాన్, డిపిఎం జయశ్రీ రాజ్, ఏపిఎం శివ కుమార్ సిసి అలివేలు ,మండల సమాఖ్య అధ్యక్షురాలు యోగేశ్వరి, వివోఏ అరుంధతి ,మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించాలి

* **జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు**

సూర్యాపేట, జూన్28, (సమయం న్యూస్) : విద్యార్థులకి నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తెలిపారు. శని వారం సూర్యాపేట పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు ఆకస్మిక తనిఖీ లు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్టాక్ రూమ్ లో ఉన్న బియ్యం, అలాగే స్టాక్ రిజిస్టర్ వివరాలు పరిశీలించారు. తదుపరి సూర్యాపేట పట్టణం లోని తాళ్లగడ్డ లో ఉన్న టి జీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఐ ఎస్ లో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపు ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హెల్త్ చెకప్ జాగ్రత్తగా చేయాలని సూచించారు.

# పాత ప్రాజెక్టుల పునరుద్ధరణ

* **కొత్త ప్రాజెక్టులకు ప్రాధాన్యం**
* **నీటి భద్రతే ప్రభుత్వ ధ్యేయం--**
* **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి..**





వికారాబాద్ జిల్లా జూన్ 28( సమయం న్యూస్) : రాష్ట్రంలోని ప్రతి నీటిపారుదల ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా,ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నదని రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లాలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , పశుసంవర్ధక,యువజన మరియు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు రిజర్వాయర్ లను సందర్శించి, జూరాల ప్రాజెక్టు ఏర్పడిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్ట్ సాంకేతికంగా పూర్తి భద్రంగా కొనసాగుతోందని తెలిపారు. 62 గేట్లలో 58 గేట్లు నిర్విరామంగా పనిచేస్తున్నాయని,తాత్కాలికంగా నాలుగు గేట్లకు రోప్ సమస్య తలెత్తినప్పటికీ,దాని వల్ల ప్రాజెక్ట్‌కి ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు.గతంలో ఎన్నో భారీ వరదలను జూరాల డ్యామ్ విజయవంతంగా ఎదుర్కొందని, ఇప్పుడు కూడా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం జాగ్రత్తలు పాటిస్తోందని తెలిపారు. గత దశాబ్ద కాలంలో తెలంగాణలో జరిగిన పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని ఆవేదన వ్యక్తం చేశారు.అయితే ప్రస్తుతం వచ్చిన కొత్త ప్రభుత్వం, గత పాత తప్పిదాలను సరిచేసే దిశగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కేవలం 18 నెలల్లోనే ఇరిగేషన్ లో ఆపరేషన్ & మెయింటెన్స్ పట్ల ప్రత్యేక దృష్టి సారించి,ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జూరాల డ్యాంపై నుండి భారీ వాహనాలు వెళ్లడాన్ని పూర్వంలోనే నిషేధించేలా సాంకేతిక నివేదికలు ఇచ్చినప్పటికీ,గత ప్రభుత్వ పాలనలో వాటిని పట్టించుకోలేదన్నారు. కానీ ఇప్పుడు సమస్య తీవ్రతను గుర్తించి,జూరాల ఆవరణలో అల్టర్నేట్ రోడ్,వాహనాల వంతెన కోసం రూ.100 కోట్లు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. అంతేకాకుండా, జూరాల, మంజీరా,నాగార్జున సాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులన్నింటికీ రొటీన్ మెయింటెనెన్స్ చేపట్టి భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా ముందుగానే సాంకేతికంగా సమర్థంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జూరాల ప్రాజెక్టును పూర్తిగా రీస్టోర్ చేసి,వాటి సామర్థ్యాన్ని పెంచే దిశగా డిసిల్టేషన్, సెడిమెంటేషన్ తొలగింపు పనులు చేపడుతున్నామన్నారు.జూరాలకు అదనంగా గ్యాంట్రీ కోసం రూ.300 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ర్యాలంపాడు రిజర్వాయర్ సామర్థ్యాన్ని నాలుగు టీఎంసీల వరకు పెంచేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రస్తుతం రెండు టీఎంసీల వరకు మాత్రమే నీరు నిల్వ అవుతుంది,మిగతా రెండు టీఎంసీల సామర్థ్యం అమలు అవుతే రైతులకు గణనీయమైన లాభం చేకూరుతుందని అన్నారు. తుమ్మెళ్ల ఎత్తిపోతల పథకం కింద మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు భూసేకరణ పనులను వేగవంతం చేయడమే కాకుండా,జూరాల ఎడమ కాలువ ద్వారా ర్యాలంపాడు రిజర్వాయర్ పనులను త్వరితంగా పూర్తి చేస్తామని తెలిపారు.నెట్టెంపాడు భూసేకరణ కోసం ఇప్పటికే ₹25 కోట్లు విడుదల చేశామని ,మిగతా మొత్తం త్వరలోనే ఇవ్వబడుతుందని తెలిపారు. నెట్టెంపాడు ప్రాజెక్టుకు రూ.2051 కోట్లు మంజూరు చేసి పనులను వేగంగా జరిపిస్తున్నామని, డిసెంబర్ 2025 లోపల 100% పూర్తి చేస్తామన్నారు. మానవ వనరుల దృష్టికోణంలోనూ,గత ప్రభుత్వ పాలనలో ఒక్క రిక్రూట్మెంట్ కూడా జరగనప్పుడు,నూతనంగా 11,000 మంది ఇరిగేషన్ ఇంజినీర్లను నియమించడం జరిగింది అనీ,ఇది ఈ ప్రభుత్వ విధేయతకు నిదర్శనమని చెప్పారు.తమ ప్రభుత్వ లక్ష్యం పాత ప్రాజెక్టులకు పూర్తి స్థాయి పునరుత్థానం కల్పిస్తూ,కొత్త ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రాన్ని నీటిలో సమృద్ధిగా ఉంచడమేనని స్పష్టం చేశారు.ప్రతి రైతు,ప్రతి గ్రామస్థుడు సంతోషంగా ఉండేలా, ప్రభుత్వం నీటిపారుదల శాఖ ద్వారా ఎంతో ప్రామాణికత, బాధ్యతతో పని చేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల మరియు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు ఎంతమాత్రం ఒడిదుడుకులు వచ్చినా తట్టుకుని నిలబడిన విశ్వసనీయ ప్రాజెక్టు అని పేర్కొన్నారు. 2009లో వచ్చిన భారీ వరదల సమయంలోనూ రోజుకి 12 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినప్పటికీ, ప్రాజెక్టు ఎంతమాత్రం నష్టాన్ని ఎదుర్కొనలేదని అన్నారు. ప్రజల్లో ఆందోళన కలిగించేందుకు కొంతమంది కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని,అలాంటి అసత్యాల్ని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారిందని, సాగునీటి లభ్యత పెరిగిందని అన్నారు.ర్యాలంపాడు ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచేలా రెండు నుంచి నాలుగు టీఎంసీల నీటిని నిల్వ చేసే పనులను వేగవంతం చేయాలని మంత్రిని అభ్యర్థించారు. జూరాలపై భారీ వాహనాలు రాకుండా రోడ్ కం బ్రిడ్జి ఏర్పాటు చేయడానికి కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంతో సమన్వయం జరిపి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తొలగిస్తే నీటి నిల్వ సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ,ఇంజినీర్ఇన్ చీఫ్ ఓ అండ్ ఏం శ్రీనివాస్, డ్యామ్ సేఫ్టీ చీఫ్ ఇంజినీర్ టి. ప్రమీలా,వనపర్తి చీఫ్ ఇంజినీర్ ఏ. సత్యనారాయణ రెడ్డి, గద్వాల సూపరింటెండింగ్ ఇంజినీర్ రహీంఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# మంథని ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

* **రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు డి.శ్రీధర్ బాబు**
* **అభివృద్ధి పనులలో భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తాం**
* **పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాల కల్పన**
* **మంథని పట్టణంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన మంత్రి శ్రీధర్ బాబు**



మంథని, జూన్ 28:(సమయం న్యూస్) : మంథని ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు. శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంథని ప్రాంతంలో మౌలిక సదుపాయాల పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలని సీఎం, రోడ్లు భవనాల శాఖ మంత్రి సహకారంతో కృషి చేస్తున్నామని అన్నారు. గోదావరి నది పై మంథని నుంచి శివారం వరకు 125 కోట్లతో చేపట్టిన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు,162 కోట్ల రూపాయలతో మంథని పట్టణానికి 9.4 కిలోమీటర్ల మేర 4 లైన్ రింగ్ రోడ్డు పనులకు, 22 కోట్లతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు భూమి పూజ చేశామని అన్నారు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం, రింగ్ రోడ్డు లో భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం అందించి అందరికీ న్యాయం చేస్తామని అన్నారు. హై లెవెల్ బ్రిడ్జి, రింగ్ రోడ్డు వల్ల మంథని, మంచిర్యాల, చెన్నూరు, మహారాష్ట్ర రాకపోకల పెరుగుతాయని అన్నారు. హై లెవెల్ బ్రిడ్జి వల్ల వాణిజ్యం పెరుగుతుందని, దీని నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మంత్రి కోరారు. మంథని పట్టణంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడేలా అన్ని హక్కులతో నూతన ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని అన్నారు. న్యాయవాదుల కోరిక మేరకు మందిని పట్టణంలో జ్యుడీషియల్ క్వార్టర్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు. మంథని ప్రాంతంలో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చేసి పరిశ్రమలు ఆకర్షించి స్థానికంగా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మంథని ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, అభివృద్ధి పనులకు అవరోధాలు సృష్టించవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. సురేష్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంథని సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలి

* **రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు డి.శ్రీధర్ బాబు**
* **ఎరువులు, విత్తనాల సరఫరా పట్ల రైతులు ఆందోళన చెందవద్దు**
* **భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ శాఖ ఇన్ ఫ్రా ఏర్పాటు**
* **మంథని ఆసుపత్రిలో రోగులను ఇతర ఆసుపత్రికి రిఫర్ చేయడం మానివేయాలి**
* **పైలెట్ ప్రాజెక్టు క్రింద ఒక రేషన్ షాపు వద్ద సూపర్ మార్కెట్ ఏర్పాటుకు ప్రణాళిక**
* **ఎస్సారెస్పీ కాల్వలలో సిల్ట్ తొలగింపు చర్యలు తీసుకోవాలి**



* **శివ కిరణ్ గార్డెన్స్ లో 4 మండలాల అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించిన మంత్రి శ్రీధర్ బాబు**

మంథని, జూన్28:(సమయం న్యూస్) : మంథని సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి శివ కిరణ్ గార్డెన్స్ లో 4 మండలాల అధికారులతో అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ, పౌరసరఫరాల శాఖ, సింగరేణి , జాతీయ రహదారుల భూ సేకరణ, వైద్య శాఖ, మిషన్ భగీరథ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, విద్యా శాఖ, నీటిపారుదల శాఖ పని తీరు సంబంధిత అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మంథని ప్రాంతంలో రైతులకు ఎరువులు విత్తనాలు స్టాక్ కొడుతూ ఉందని దుష్ప్రచారం జరుగుతుందని, మన దగ్గర అవసరానికి మించి స్టాక్ సమృద్ధిగా అందుబాటులో ఉందని ఎవరు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను, పీక్ డిమాండ్ దృష్టిలో ఉంచుకొని మంథని ప్రాంతంలో అవసరమైన సబ్ స్టేషన్, అదనపు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గంగదేవిపల్లి లో సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు వారం రోజులలో శంకుస్థాపన చేయాలని, మచ్చుపేట లో 132 కేవి సబ్ స్టేషన్ ఏర్పాటు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మంథని పట్టణంలో విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గులు (ఫ్లక్చువేషన్) జరుగుతుందని, దీనిని వెంటనే ఎస్ఈ ప్రత్యేకంగా సమీక్షించి పరిష్కరించాలని అన్నారు. ప్రతి సబ్ స్టేషన్ వారిగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా సమస్యలు లేకుండా పరిష్కరించాలని, రాబోయే 3 నెలల పాటు విద్యుత్ సరఫరా చాలా కీలకమని, అధికారులు అప్రమత్తం ఉండాలని మంత్రి తెలిపారు. సన్న బియ్యం సరఫరాకు సంబంధించి ప్రజలలో స్పందన తెలుసుకోవాలని అన్నారు. మంథని పరిధిలో నూతనంగా 1417 రేషన్ కార్డులు జారీ చేశామని, 12 వేల 559 సభ్యులకు అదనంగా రేషన్ అందుతుందని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి తప్పనిసరిగా పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు రేషన్ కార్డులు జారీ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో ఎక్కడ కోతలకు ఆస్కారం ఉండడానికి వీలు లేదని అన్నారు. మంథని ప్రాంతంలో పైలేట్ ప్రాజెక్టు క్రింద రేషన్ షాపు వద్ద చిన్న సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు.

## ఇంటి నెంబరు కోసం రూ.5 వేలు లంచం..

# ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్

* సుల్తానాబాద్‌లో లంచం తీసుకుంటూ ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులు అరెస్ట్
* కొత్త ఇంటికి నంబర్ కేటాయించేందుకు రూ. 5 వేలు డిమాండ్
* బాధితుడి ఫిర్యాదుతో వల పన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు
* అరెస్టయిన వారిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్
* లంచం అడిగితే 1064కు ఫోన్ చేయాలని ప్రజలకు ఏసీబీ విజ్ఞప్తి
* ఫిర్యాదుదారుల వివరాలు



**గోప్యంగా ఉంచుతామని స్పష్టీకరణ**

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం తీసుకునే అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పురపాలక సంఘంలో లంచం తీసుకుంటున్న ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొత్తగా నిర్మించిన ఇంటికి నంబర్ కేటాయించేందుకు ఓ పౌరుడి నుంచి రూ. 5,000 లంచం స్వీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

**వివరాల్లోకి వెళితే..**

సుల్తానాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నంబర్ కేటాయించాలని కోరుతూ స్థానిక పురపాలక కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనపర్తి వినోద్ కుమార్, బిల్ కలెక్టర్ నాంపల్లి విజయ్ కుమార్ రూ. 5,000 లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆ వ్యక్తి నేరుగా తెలంగాణ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ముందుగా అనుకున్న ప్రకారం, ఫిర్యాదుదారుడు శుక్రవారం నాడు కార్యాలయంలో వినోద్ కుమార్, విజయ్ కుమార్‌లకు రూ. 5,000 ఇస్తుండగా.. అక్కడే మాటువేసిన ఏసీబీ బృందం వారిని అదుపులోకి తీసుకుంది. లంచం డబ్బును స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఉద్యోగులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

*** లంచం అడిగితే ఫిర్యాదు చేయండి: ఏసీబీ**

ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సేవలు అందించడానికి లంచం అడిగితే ఏమాత్రం భయపడకుండా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని సూచించారు. అంతేకాకుండా వాట్సాప్ నంబర్ 9440446106ద్వారా గానీ, ఫేస్‌బుక్, ఎక్స్ (@TelanganaACB) వంటి సామాజిక మాధ్యమాల ద్వారా గానీ, అధికారిక వెబ్‌సైట్ ద్వారా గానీ సంప్రదించవచ్చని తెలిపారు. లంచంపై ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని అధికారులు భరోసా ఇచ్చారు.




# తెలంగాణలో భారీగా డీఎస్పీల బదిలీలు.. 44 మందికి స్థానచలనం

* ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ జితేందర్
* వివిధ విభాగాలకు అధికారుల స్థానచలనం
* సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోనూ మార్పులు

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయి అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ బదిలీలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా పలువురు అధికారులకు కీలక పోస్టింగులు కేటాయించారు. బదిలీ అయిన వారిలో వై. నాగేశ్వరరావును సైబరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) ఏసీపీగా నియమించారు. అదేవిధంగా, ఆకుల చంద్రశేఖర్‌కు మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీగా, సంపత్‌కుమార్‌కు రాచకొండ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏసీపీగా బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, కమిషనరేట్ల పరిధిలో పనిచేస్తున్న డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# మహాటీవీ ఆఫీసుపై దాడి.. తీవ్రంగా స్పందించిన రేవంత్ రెడ్డి

* మహాటీవీ కార్యాలయంపై జరిగిన దాడి ఘటన
* తీవ్రంగా ఖండించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
* దాడిని అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి
* ప్రజాస్వామ్యంలో ఇలాంటివి సమర్థనీయం కాదన్న ముఖ్యమంత్రి
* దాడిని ఖండించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి






ప్రముఖ తెలుగు వార్తా ఛానల్ మహాటీవీ కార్యాలయంపై జరిగిన దాడిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఆయన సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. మీడియా సంస్థపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని, దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి దాడులకు ఏమాత్రం తావులేదని రేవంత్ రెడ్డి తన ప్రకటనలో పేర్కొన్నారు. మహా న్యూస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు ఎటువంటి స్థానం లేదని, మీడియా సంస్థలపై దాడులు చేయడం అంటే ప్రజల అభిప్రాయ స్వేచ్ఛను అణచివేయాలనే దురుద్దేశంతో కూడిన చర్య అని ఆయన అన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఈ ఘటనను నిర్దాక్షిణ్యంగా చూడాలని, ఈ దాడిలో పాలుపంచుకున్నవారితో పాటు, ఈ దాడి వెనుక నిలిచినవారినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను సూచిస్తున్నానని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను సహించేది లేదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడడమే మనందరి బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు.

# తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్ష ఎన్నికలకు రంగం సిద్ధం

బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు నూతన అధ్యక్షులను ఎన్నుకునేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసింది. రెండు రాష్ట్రాలకు దాదాపు ఒకే సమయంలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, జులై 1న నూతన సారథులను ప్రకటించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాయి. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం (జూన్ 29) నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం (జూన్ 30) అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. అనంతరం జులై 1వ తేదీన ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారు.

**ఏపీలోనూ మొదలైన ప్రక్రియ**

ఆంధ్రప్రదేశ్‌లోనూ బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. కేవలం



మూడు రోజుల్లోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ వివరాలను పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ విజయవాడలో మీడియా సమావేశంలో వెల్లడించారు. జూన్ 30న నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, అదే రోజు సాయంత్రంలోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని తెలిపారు. జులై 1వ తేదీ నాటికి పార్టీ నూతన అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో వాహనదారులకు గుడ్ న్యూస్.. పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభం

* కొండాపూర్ - ఓఆర్ఆర్‌ను కలిపే పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభం
* ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
* గచ్చిబౌలి జంక్షన్ వద్ద భారీగా తగ్గనున్న ట్రాఫిక్ రద్దీ
* హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు మెరుగుపడిన కనెక్టివిటీ
* 1.2 కిలోమీటర్ల పొడవుతో ఆరు వరుసలుగా ఫ్లైఓవర్ నిర్మాణం
* శంషాబాద్ విమానాశ్రయానికి వేగంగా ప్రయాణించే సౌకర్యం



హైదరాబాద్ నగరంలోని ఐటీ కారిడార్‌లో వాహనదారుల ట్రాఫిక్ కష్టాలకు ఉపశమనం కలిగిస్తూ మరో ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. కొండాపూర్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు నిర్మించిన పీజేఆర్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం లాంఛనంగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ కొత్త ఫ్లైఓవర్ నిర్మాణంతో హైదరాబాద్‌లో అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. మొత్తం 1.2 కిలోమీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసలుగా ఈ ఫ్లైఓవర్‌ను ఆధునిక ప్రమాణాలతో నిర్మించారు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభంతో ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్, హఫీజ్‌పేట్ మార్గాల్లో ప్రయాణించే వారికి ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుంది. ముఖ్యంగా హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. కొండాపూర్, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఇకపై ఎలాంటి ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా నేరుగా ఔటర్ రింగ్ రోడ్డుకు చేరుకోవచ్చు. దీనివల్ల ఐటీ ఉద్యోగులు, స్థానిక నివాసితులు, విమానాశ్రయ ప్రయాణికులకు ఎంతో మేలు జరగనుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# మీడియా సంస్థలపై కేటీఆర్ ఫైర్.. చట్టపరమైన చర్యలకు సిద్ధం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొన్ని మీడియా సంస్థలు, జర్నలిస్టుల వ్యవహారశైలిపై తీవ్రంగా మండిపడ్డారు. తనపై, తమ పార్టీ నాయకత్వంపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు జర్నలిస్టుల ముసుగులో తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పదేపదే ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "జర్నలిస్టుల ముసుగులో కొందరు దుర్మార్గులు గత కొన్ని నెలలుగా నాపైనా, మా పార్టీ నాయకత్వంపైనా విషం చిమ్ముతున్నారు" అని ఆయన అన్నారు. ఇలాంటి వారి అభిప్రాయాలను, ఉనికిని తాను ఏమాత్రం ఖాతరు చేయనని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఈ నిరంతర వ్యక్తిగత దూషణల వల్ల తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, పార్టీ సహచరులు మానసికంగా వేదనకు గురవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగానే తాను చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నానని ఆయన తెలిపారు. ఇలాంటి రాతలు రాస్తున్న ప్రతి ఒక్కరిపై కేసులు పెడతానని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల వెనుక ఎవరున్నారనే విషయంపై కూడా కేటీఆర్ స్పందించారు. "ఈ వ్యవస్థీకృత దాడుల వెనుక ఎవరున్నారో నాకు తెలుసు.

# జస్ప్రీత్ బుమ్రా టెస్ట్ భవిష్యత్తు ఏంటి?

బూమ్.. బూమ్.. బుమ్రా.. టీమ్ఇండియా అమ్ముల పొదిలో అతడో అద్భుత అస్త్రం. అతడి పేరు చెబితేనే ప్రత్యర్థి బ్యాటర్లకు హడల్. అతడి చేతిలోంచి బ్రహ్మాస్త్రాల్లాంటి బంతులు రాకెట్‌వేగంతో దూసుకొస్తుంటే.. వాటిని ఎదుర్కోవడం కొమ్ములు తిరిగిన బ్యాటర్లకు కూడా సవాలే. కానీ అలాంటి బుమ్రా ఇప్పుడు వెన్ను గాయంతో సతమతమవుతున్నాడు! వర్క్‌లోడ్‌తో తన పరిధి తగ్గించుకుంటున్నాడు. ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కొన్ని మ్యాచ్‌లకే పరిమితం కాబోతున్నాడు! మరి టెస్ట్ ఫార్మాట్‌లో జస్ప్రీత్ బుమ్రా భవిష్యత్తు ఏంటి?!



ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీ సందర్భంగా జస్ప్రీత్ బుమ్రా గాయపడ్డాడు. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా దూరమయ్యాడు. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ తరఫున తిరిగి మైదానంలో అడుగుపెట్టాడు. ఇంగ్లాండ్‌తో లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌తో మళ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేశాడు. అయితే బుమ్రా మునుపటిలా పూర్తి ఫిట్‌గా అయితే లేడు! వర్క్‌లోడ్ నేపథ్యంలో అతడు ఇంగ్లాండ్ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడతాడని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ముందుగానే ప్రకటించాడు. అయితే అవి ఏవే మ్యాచ్‌లన్నది మాత్రం వెల్లడించలేదు. లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో బుమ్రా మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. 24.4 ఓవర్లపాటు బౌలింగ్ చేసి 83 పరుగులిచ్చి 5 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం అంతగా ప్రభావం చూపలేదు. 19 ఓవర్లు బౌలింగ్ చేసి 57 పరుగులిచ్చాడు. వికెట్లు మాత్రం తీసుకోలేకపోయాడు. ఇలా మొత్తంగా మొదటి టెస్ట్ మ్యాచ్‌లో 43.4 ఓవర్లపాటు బౌలింగ్ చేశాడు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇన్ని ఓవర్లు బుమ్రా వేయడం అనేది ఓ రకంగా రిస్క్ తీసుకోవడమే. అందుకే వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా రెండో టెస్ట్ మ్యాచ్‌లో ఆడటం లేదని సమాచారం. అధికారికంగా మాత్రం ఇప్పటి వరకు ధ్రువీకరించలేదు.

**టీమ్ఇండియాకూ కలవరమే!**

లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్ జూన్ 24న ముగిసింది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా రెండో టెస్ట్ మ్యాచ్ జులై 2 నుంచి ప్రారంభం కానుంది. అంటే రెండు టెస్ట్‌మ్యాచ్‌లకు మధ్య ఏడు రోజుల సమయం ఉంది. అయినా బుమ్రా రెండో మ్యాచ్ ఆడటంపై సందేహంగానే ఉంది. మూడో టెస్ట్ మ్యాచ్ లార్డ్స్ వేదికగా జులై 10 నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు మాత్రం బుమ్రా అందుబాటులో ఉంటాడనే వార్తలు వినవస్తున్నాయి. అంటే మ్యాచ్‌కు.. మ్యాచ్‌కు మధ్య ఇన్ని రోజులు విరామం బుమ్రాకు కావాల్సి వస్తోంది! ఓ రకంగా ఇది టీమ్ఇండియాను కలవరపరిచే విషయమే. అంతే కాకుండా ఇది బుమ్రా టెస్ట్ క్రికెట్ భవిష్యత్తుపై కూడా అనేక సందేహాలను లేవనెత్తుతోంది. ఫిట్‌నెస్ సమస్యలతోనే అతడు కెప్టెన్ రేసు నుంచి కూడా తప్పుకున్న విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో.. బుమ్రా భవిష్యత్తులో సుదీర్ఘ కాలం టెస్ట్ క్రికెట్‌కు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించలేడని పలువురు క్రికెట్ విశ్లేషకులు కుండబద్దలు కొడుతున్నారు. అతడు ఇకపై వైట్‌బాల్ క్రికెట్‌కే ప్రాధాన్యం ఇస్తాడేమో.. అని పలువురు టీమ్ఇండియా అభిమానులూ అభిప్రాయపడుతున్నారు.

**ఇప్పటికిప్పుడు సాధ్యం కాదు..**

బుమ్రా స్థానాన్ని మరో బౌలర్‌తో భర్తీ చేయడం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే సూచనలు కనిపించడం లేదు. కానీ.. ప్రత్యామ్నాయ బౌలర్‌ను తయారు చేసుకోవాల్సిన బాధ్యత టీమ్ఇండియా కోచ్, యాజమాన్యంపై ఉంది. అలాగే ఫిట్‌నెస్ సమస్యలతో ఇంగ్లాండ్ సిరీస్‌కు ఎంపిక కాని మహమ్మద్ షమీ విషయంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది! ప్రస్తుతం టెస్ట్ జట్టులో బుమ్రా తర్వాత 37 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన మహ్మద్ సిరాజ్ సీనియర్ బౌలర్‌గా ఉన్నాడు. అతడు కూడా ఈ మధ్య ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. తర్వాత ఆకాశ్‌దీప్‌నకు 7, ప్రసిద్ధ్ కృష్ణకు 4 టెస్ట్ మ్యాచ్‌ల అనుభవం ఉంది. ఇక యువ బౌలర్ అర్షదీప్ సింగ్ ఇంత వరకు ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా సమీప భవిష్యత్తులో బౌలింగ్ పరంగా తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనే సూచనలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో యువ బౌలర్లకు ఇదే అద్భుత అవకాశమూ కానుంది. చక్కటి ప్రతిభ చాటి, జట్టులో సుస్థిర స్థానం పొందేందుకు ఇంతకంటే చక్కటి ఛాన్స్ మరోటి ఉండదని క్రీడా పండితులు విశ్లేషిస్తున్నారు.

## శోభిత.. నేను ఆ రూల్ ఫాలో అవుతాం



హైదరాబాద్: నటుడు నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల గతేడాది చివర్లో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. పెళ్లి తర్వాత కూడా సినిమాలు, సిరీస్‌లు చేస్తూ వీరిద్దరూ ఫుల్ బిజీగా ఉంటున్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాన్ని బ్యాలెన్స్ చేస్తూ ముందుకుసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే నటుడు నాగచైతన్య తాజాగా ఓ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడారు. శోభితతో తన జీవితం సంతోషంగా సాగుతుందన్నారు. వారం మొత్తం వర్క్‌లైఫ్‌లో బిజీగా ఉన్నప్పటికీ.. వారాంతంలో మాత్రం వ్యక్తిగత జీవితానికే టైమ్ స్పెండ్ చేస్తామని చెప్పారు. ఒక విషయంలో మాత్రం కచ్చితమైన నియమాన్ని పాటిస్తామని తెలిపారు. ''వర్క్ లైఫ్ కారణంగా మేమిద్దరం కలిసి టైమ్ స్పెండ్ చేయడానికి అంతగా వీలుపడదు. క్వాలిటీ టైమ్‌ను స్పెండ్ చేయడానికి, అనుబంధాన్ని పెంచుకోవడం కోసం మేమిద్దరం కొన్ని రూల్స్ పాటిస్తాం. ముఖ్యంగా మేమిద్దరం హైదరాబాద్‌లోనే ఉంటే తప్పకుండా ఉదయం, రాత్రి సమయాల్లో కలిసే భోజనం చేయాలని నిర్ణయించుకున్నాం. ఆదివారాల్లో మాకు నచ్చిన విధంగా ఉంటాం. మూవీ నైట్, షికారుకు వెళ్లడం, నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకోవడం, లేదా కుక్ చేసుకోవడం.. ఇలా ఆ క్షణాలను ప్రత్యేకంగా, మధురజ్ఞాపకంగా మార్చుకుంటాం. తనకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. నాకు రేసింగ్‌పై ఆసక్తి. ఇద్దరం కలిసి హాలిడే ప్లాన్స్ వేస్తాం. ఇటీవల తనకు రేస్‌ట్రాక్‌పై డ్రైవింగ్ నేర్పించా. తను ఎంతో సంతోషించింది. ఎంజాయ్ చేసింది'' అని నాగచైతన్య చెప్పారు.

## సినిమా



## ది ఫ్యామిలీ మ్యాన్ ఈజ్ బ్యాక్

ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న 'ది ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ మళ్లీ వచ్చేసింది. ఇప్పటివరకూ రెండు సీజన్లు పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ ముచ్చటగా మూడోసారి అలరించడానికి రెడీ అయ్యింది. ఇప్పటికే షూటింగ్ పనులు పూర్తి చేసుకున్న ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులతో బిజీగా ఉంది. ఇందులో మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్ర పోషించగా.. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో 'ఫ్యామిలీమ్యాన్: సీజన్3' త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కానుంది. ఈ క్రమంలో తాజాగా టీమ్ సర్‌ప్రైజ్ ఇస్తూ.. గ్లింప్స్‌ను రిలీజ్‌చేసింది. ఆసక్తికరంగా ఉన్న ఆ వీడియోలో 'మీరేం చేస్తుంటారంటూ..' ఓ వ్యక్తి మనోజ్ బాజ్‌పాయ్‌ని అడగ్గా.. 'నేను లైఫ్ అండ్ రిలేషన్‌షిప్ కౌన్సిలర్‌ను' అంటూ తివారీ అతడికి రిప్లై ఇచ్చాడు. 'ది ఫ్యామిలీ మ్యాన్' ఈజ్ బ్యాక్.. న్యూ సీజన్ కోసం వేచి ఉండండి అంటూ వీడియోను ముగించింది. ఇందులో పాతాళ్ లోక్ నటుడు జైదీప్ అహ్లావత్ విలన్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ మూవీ నార్త్ ఈస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతుండగా.. యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా భారీస్థాయిలో ఉండనున్నట్లు టీమ్ పేర్కొంది.

## ప్రభాస్ పెండ్లిపై రచ్చ రచ్చ



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ పెండ్లిపై మళ్లీ సోషల్ మీడియా రచ్చ రచ్చ చేస్తోంది. ఈ ఏడాదే డార్లింగ్ బ్యాచిలర్ జీవితానికి ఫుల్‌స్టాప్ పడుతుందంటూ ఎప్పటికప్పుడు ఊహాగానాలు వినిపించినా అవన్నీ ఉట్టి పుకార్లుగానే మిగిలిపోయాయి. అయితే ఎవరెన్ని అనుకున్నా.. వయసు మీద పడుతున్నా సరే.. ప్రభాస్ మాత్రం పెండ్లంటేనే ముఖం చాటేస్తున్నాడు. కాగా రియల్ లైఫ్‌లోనే కాదు రీల్ లైఫ్‌లో కూడా ఇదే జరిగింది. మంచు విష్ణు హీరోగా నటించిన 'కన్నప్ప' మూవీలో ప్రభాస్ డైలాగ్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌కు ఫ్యాన్స్ గోలగోల చేస్తున్నారు. రుద్ర పాత్రలో ప్రభాస్ చెప్పిన డైలాగులకు అభిమానుల అరుపులతో థియేటర్లు దద్దరిల్లిపోయాయి. ముఖ్యంగా రుద్ర, కన్నప్ప మధ్య జరిగే ఓ సీన్‌లో పెండ్లి టాపిక్ వస్తుంది. నీకు పెళ్లి అయిందా? అని రుద్రను కన్నప్ప అడుగుతాడు. అందుకు ప్రభాస్ .. నా పెండ్లి గురించి నీకెందుకులే అంటూ కౌంటరిచ్చాడు. అప్పుడు విషయం అర్థమైన విష్ణు.. పెళ్లి చేసుకుంటే తెలిసేది అని డైలాగ్ విసురుతాడు. ఈ సంభాషణతో టాకీస్‌లలో అభిమానులు విజిల్స్ కొడుతూ, చప్పట్లు కేరింతలతో ఒక రేంజ్ లో హంగామా చేస్తున్నారు. దీంతో తాజాగా డార్లింగ్ పెళ్లి టాపిక్ మళ్లీ దేశవ్యాప్తంగా వైరల్‌గా మారింది. ఇక సినిమాల విషయానికొస్తే .. ప్రస్తుతం ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'రాజా సాబ్'పై ఫ్యాన్స్ విపరీతమైన అంచనాలతో ఎదురుచూస్తున్నారు. మారుతి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో డార్లింగ్ రెండు భిన్నమైన లుక్స్‌తో కనిపించనున్నాడు. ఈ మూవీ 2025 డిసెంబర్ 5న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక 2026 సమ్మర్‌కి హను రాఘవపుడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' చిత్రాన్ని రిలీజ్ చేయాలనే ప్లాన్‌తో ప్రభాస్ ఉన్నట్లు సమాచారం.



మీనాక్షి చౌదరి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రశాంతమైన మరియు అందమైన రూపాన్ని పంచుకున్నారు ఇప్పుడు, మీనాక్షి మారి దర్శకత్వం వహించిన అనగనగా ఒక రాజు అనే రొమాంటిక్ కామెడీలో కనిపించడానికి సిద్ధంగా ఉంది.

## స్వీట్ మెమోరీస్



టాలీవుడ్ హీరో అఖిల్ అక్కినేని తన చిరకాల ప్రేయసి జైనాబ్ తో ఈనెల 6న వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. మ్యారేజ్ తర్వాత గ్రాండ్ రిసెప్షన్ వేడుక కూడా జరిపారు. ఈ ఫంక్షన్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అయితే పెండ్లి జరిగిన అనంతరం కింగ్ నాగార్జున తన సోషల్ మీడియా ద్వారా కొన్ని ఫొటోలు మాత్రమే షేర్ చేశాడు. చైతూ కూడా ఇన్‌స్టాలో కొన్ని పిక్స్ పంచుకున్నాడు. తాజాగా అఖిల్ తన సోషల్ మీడియా వేదికగా పెండ్లి ఫొటోలను అభిమానులతో పంచుకున్నాడు. 'జూన్ 6, 2025.. నా జీవితంలో అత్యుత్తమ రోజులో కొన్ని క్షణాలను మీతో పంచుకోవాలని నా హృదయానికి అనిపించింది. ఈ స్వీట్ మెమోరీస్ అందించిన వారికి ధన్యవాదాలు' అంటూ ఎమోషనల్‌పోస్ట్‌పెట్టాడు. ప్రస్తుతం న్యూ కపుల్ క్యూట్ పిక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే అఖిల్ ప్రస్తుతం 'లెనిన్' సినిమాతో బిజీగా ఉన్నాడు. ఈచిత్రాన్ని మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్నారు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో లవ్ అండ్ యాక్షన్ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సేను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.



Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.